Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి   సంపుటి (Vol) : 7   సంచిక (Issue) : 160   పేజీలు (Pages) : 8   వెల : రూ. 2.00   ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 30 - 1 - 2026

94406 62699   rajadhanivartalu   rajadhaniv   www.rajadhanivartalu.com   NI No.: APTEL/2019/77985  Postal regd: GTR/114/2025-27   స్థాపితం : 2015

# నేడు మహాత్మా గాంధీ వర్ధంతి

**- అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సందేశం**



**అమరావతి, (రాజధాని వార్తలు):** "జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి 'అమరవీరుల దినోత్సవం' సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీజీకి నా వినయపూర్వకమైన నివాళులు అర్పిస్తున్నాను. ఈ రోజున స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలను త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులకు దేశం నివాళులర్పిస్తుంది. సహాయ నిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి అనేక చారిత్రాత్మక ఉద్యమాలను మహాత్మా గాంధీ నాయకత్వం వహించి ఎటువంటి రక్తపాతం లేకుండా బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందేందుకు భారత స్వాతంత్ర్య ఉద్యమానికి గాంధీజీ సహకారాన్ని మాటల్లో కొలవలేము. గాంధీజీ విధానాలు అహింసాయుతమైనవి మరియు దేశంలోని లక్షలాది మందికి స్ఫూర్తిదాయకం. ఈ రోజున 'అమరవీరుల దినోత్సవం' సందర్భంగా, మహాత్మా గాంధీ ఇంకా ఇతర స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుందాం, సాహసోపేతమైన అమరవీరులకు నివాళులు అర్పిద్దాం మరియు స్వేచ్ఛ మరియు స్వాతంత్ర్యం కోసం వారి నిబద్ధతను త్యాగాలను గుర్తు చేసుకుందాం."

# నేతన్నలకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం పచ్చ జెండా. ఏప్రిల్ 1 నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు. ఈ పథకం వల్ల నెలకు రూ.85 కోట్ల మేర ప్రభుత్వం భారం. మగ్గానికి 200 యూనిట్లు - 93 వేల కుటుంబాలకు లబ్ధి, మర మగ్గానికి 500 యూనిట్లు - 10,534 కుటుంబాలకు లబ్ధి. మొత్తంగా 1.03,534 కుటుంబాల్లో 4 లక్షల మందికి లబ్ధి. చేనేత, పవర్ లూమ్ కార్మికులకు ఆర్థిక ఊరట కలుగుతుంది. మగ్గానికి 200 యూనిట్లకు నెలకు సుమారుగా రూ.720లు, ఏడాదికి రూ.8,640లు ఆదా. మర మగ్గం లబ్ధిదారులకు నెలకు రూ.1800లు, ఏడాదికి రూ. 21,600లు ఆదా. 50 ఏళ్లకే నేతన్నలకు రూ.4 వేల పెన్షన్లు. 87,280 మందికి నేతన్నలకు పెన్షన్లు ఇస్తున్నాం. రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్లు పెంచడం వల్ల నేతన్నకు నెలకు రూ.1000 చొప్పున్న ఏడాదికి రూ.12,000 వేలు ఆర్థిక లబ్ధి కలుగుతోంది. చేనేత రంగ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆప్కో ద్వారా చేనేత సహకార సంఘాలకు రూ.7 కోట్ల బకాయిల చెల్లింపు. రూ.1.67 కోట్ల ఈ ఏడాది మొదటి విడత త్రిఫ్ట్ ఫండ్ నిధులిచ్చాం. NHDC ద్వారా నూలుపై 15 శాతం రాయితీ ఇస్తున్నాం. నేతన్నలకు ఇచ్చే ప్రాసెసింగ్ ఛార్జీలు పెంచాం. ఆప్కోలో రెడీ మేడ్ దుస్తుల అమ్మకాలతో నేతన్నలకు పెరిగిన ఉపాధి. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కో ఆప్టెక్స్, టాటా తనేరియా, బిర్లా ఆద్యం సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. ఈ కామర్స్ లో ద్వారా చేనేత వస్త్రాల డోర్ డెలివరీ. విశాఖలో 5 ఎకరాల్లో రూ.172 కోట్లతో యూనిటీ మాల్ నిర్మిస్తున్నాం. ఎమ్మిగనూరు, రాయదుర్గం, మైలవరం, పామిడిలోనూ టెక్స్ టైల్స్ పార్కులు నిర్మిస్తున్నాం. మంగళగిరిలో మెగా టెక్స్ టైల్ పార్కు నిర్మిస్తున్నాం. ధర్మవరంలో రూ.30 కోట్లతో మెగా క్లస్టర్ నిర్మిస్తున్నాం. పిఠాపురంలో మెగా క్లస్టర్ నిర్మించబోతున్నాం. రాష్ట్రంలో రూ.10.44 కోట్లతో 10 క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. ODOP అవార్డుల్లో ఏపీకి 9 అవార్డులు వస్తే.. వాటిలో చేనేత ఉత్పత్తులకు 4 అవార్డులు వచ్చాయి. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు గాను జాతీయ స్థాయిలో ఒక బంగారు పతకం లభించింది.

# ఏపిసిఆర్‌డిఏ చొరవతో పరిష్కారం కానున్న రైతుల వీధి పోట్ల సమస్య

**అమరావతి, (రాజధాని వార్తలు):** ల్యాండ్ పూలింగ్ కింద APCRDA అధికారులు రిటర్నబుల్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను పారదర్శకమైన ఈ-లాటరీ విధానం ద్వారా కేటాయించారు. అయితే వాస్తుపరంగా, అలాగే వీధి పోట్ల సమస్యలున్న కారణంగా కొందరు రైతులు పలు పర్యాయాలు ఈ ప్లాట్లకు బదులు వేరే చోట్ల ప్లాట్లు కేటాయించాలని అభ్యంతరాలు వ్యక్తం చేయడం జరిగింది. ఈ మేరకు రైతుల అభ్యంతరాలను APCRDA అథారిటీ సమావేశంలో చర్చించిన అనంతరం పలు రకాల వీధి పోట్లు వచ్చిన ప్లాట్లను పరిశీలించి మార్గదర్శకాలు రూపొందించడం జరిగింది. అనంతరం నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశంలో సైతం రాజధాని రైతులు వీధి పోట్లు ఉన్న ప్లాట్లకు సంబంధించి మరికొన్ని సమస్యలు ప్రస్తావించారు. వీటిలో పలు దిశల నుంచి వీధి పోట్లు ఉన్న ప్లాట్లు, చిన్న రోడ్డునుంచి పెద్ద రోడ్డుకు మారడం లేదా సమాన వెడల్పు రోడ్ల వల్ల ప్రభావితమైన ప్లాట్లు ఉన్నాయి. ఈ కేటగిరీలో 62 కమర్షియల్ ప్లాట్లు, అలాగే చిన్న రోడ్ నుంచి పెద్ద రోడ్ లేదా సమాన రోడ్ వెడల్పుల వల్ల ప్రభావితమైన 50 ప్లాట్లు, మొత్తంగా 112 ప్లాట్లు ఉన్నాయి. కాగా APCRDA అధికారులు.. మూడవ పక్షాలకు రిజిస్ట్రేషన్ కాని, మ్యూటేషన్ జరగని ప్లాట్లను మాత్రమే రద్దు చేసి ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు APCRDA కమిషనర్‌కు అధికారాలు కల్పిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విధానం అమలు ద్వారా రైతుల నుంచి అభ్యంతరాలు తగ్గడమే కాక అమరావతిలో అమలవుతున్న భూసమీకరణ విధానంపై నమ్మకం మరింత బలపడనుంది. ల్యాండ్ పూలింగ్ స్కీం అమలులో భాగంగా కింద రాజధాని అమరావతి ప్రాంతంలోని భూమిలేని కుటుంబాలకు నెలకు రూ.5,000 పింఛన్‌ను సామాజిక భద్రత చర్యగా అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం. APCRDA ద్వారా ఈ లబ్ధిని అందిస్తోంది. 2025 డిసెంబర్ వరకు ఈ విధంగా భూమి లేని పేదలకు పింఛన్ల రూపంలో రూ. 715.64 కోట్ల మేర లబ్ధి చేకూర్చి ఆ కుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పించడం జరిగింది.

**ఏడు కుటుంబాలలోని మైనర్ బాలలకు అందనున్న రూ.5,000 పింఛన్ లబ్ధి**

ప్రస్తుత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మైనర్లు అయిన బాలల పేరు మీద పింఛన్ మంజూరు చేసే అవకాశం లేకపోవడంతో, తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందిన 7 కుటుంబాలకు అమరావతిలో అమలవుతున్న భూమి లేని పేదలకు అందించే పింఛన్ నిలిపివేయాల్సి వచ్చింది. ఈ కుటుంబాల్లోని మైనర్ బాలలు ఎలాంటి జీవనాధారం లేని వారు కాగా..ఆర్థికంగా, శారీరకంగా బలహీనమైన వృద్ధులపై ఆధారపడి ఈ బాలలు జీవిస్తున్నారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆధార్ ఆధారిత డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ అమలులో ఉండటంతో, మైనర్లు అయిన ఏడుగురు బాలల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ జమ చేయడంలో ఎలాంటి సాంకేతిక అడ్డంకులు లేవని గుర్తించిన APCRDA అధికారులు.. మైనర్ బాలలకు పింఛన్ మంజూరు చేయడం ద్వారా ఆ కుటుంబాలకు సామాజిక న్యాయం, మానవీయ దృక్పథం, సంక్షేమ పథకాల నిరంతర అమలు సాధ్యమవుతుందని, దీనివల్ల అదనపు ఆర్థిక భారం సైతం ఉండదని వారు నివేదించారు. APCRDA అధికారులు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన క్యాబినెట్..ఈ నెల 28న నిర్వహించిన సమావేశంలో రాజధాని అమరావతిలో నివసిస్తూ భూమి లేని పేదలకు ప్రతి నెలా అందించే రూ.5,000 పింఛన్ లబ్ధిదారులైన తల్లిదండ్రులు మరణించిన 7 కుటుంబాలకు సంబంధించి మైనర్లు అయిన వారి పిల్లల బ్యాంకు ఖాతాలకు జమ చేసేలా CRDA కమిషనర్‌కి అధికారం కల్పిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదించింది.

# పామ్ ఆయిల్ రైతులకు లాభదాయక ధరల దిశగా కూటమి ప్రభుత్వ చర్యలు

**- రైతుల సంక్షేమంపై దృష్టి... ధరల నిర్ధారణ కమిటీ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు హామీ - రైతుల ఆదాయం పెంపే లక్ష్యం... ఉద్యాన, పామ్ ఆయిల్ రంగంలో సంస్కరణలు - రైతులకు మెరుగైన సేవలే లక్ష్యంగా ఉద్యాన శాఖ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు**






**అమరావతి, (రాజధాని వార్తలు):** పామ్ ఆయిల్ సాగు చేస్తున్న రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా, వడ్డేశ్వరంలోని ప్రైమ్ హిల్ క్రెస్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ కార్యాలయ నూతన భవనాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గురువారం ప్రారంభించారు. తదనంతరం, 2025-26 నూనె సంవత్సరముకు గాను పామ్ ఆయిల్ గెలలు యొక్క ధరను లెక్కించే సూత్రాన్ని నిర్ణయించేందుకు, ఆయిల్ పామ్ ధరల నిర్ధారణ కమిటీ సమావేశం, మంత్రి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ నూతన కార్యాలయ ప్రారంభం ద్వారా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ పరిపాలనా కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతూ, రైతులకు మెరుగైన సేవలు అందించడానికి దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆయిల్ పామ్ పరిశ్రమ మరియు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆయిల్ పామ్ రంగానికి సంబంధించిన వివిధ కీలక అంశాలైన ఓ.ఇ.ఆర్. శాతం / నూనె శాతం, పామ్ నట్ రికవరీలు, వంటి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆయిల్ పామ్ విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1.97 లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తుండగా, ఇది 24 జిల్లాలు, 371 మండలాలకు విస్తరించిందన్నారు. హెక్టారుకు సగటు 19.81 టన్నుల ఉత్పాదకతతో ఆయిల్ పామ్ రైతులకు మంచి ఆదాయం లభిస్తోందని, ఏపి ఆయిల్ పామ్ చట్టం-1993, నియమాలు-2008 ప్రకారం అభివృద్ధి కార్యక్రమం అమలు చేస్తూ ఫ్యాక్టరీ జోన్ల కేటాయింపు, నాణ్యమైన మొక్కల సరఫరా, సాంకేతిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 24 కంపెనీలు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుండగా, 15 ప్రాసెసింగ్ యూనిట్లు గంటకు 736 మెట్రిక్ టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్నారు. ఇండోనేషియా, మలేషియా, కోస్టారికా వంటి దేశాల నుండి దిగుమతి చేసిన నాణ్యమైన విత్తన మొలకలతో పాటు దేశవాళీ రకాల మొక్కలను రైతులకు అందిస్తున్నామని, 30 నర్సరీలు, మూడు సీడ్ గార్డెన్ల అభివృద్ధితో భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 2024-25 నూనె సంవత్సరానికి 19.42% OER అమలుతో మెట్రిక్ టన్నుకు సగటు రూ.19,579 ధర లభించగా, ఇది గత పదేళ్లలో అత్యధికమని, రైతుల్లో నమ్మకం పెరిగిందన్నారు. 2025-26లో 24,535 హెక్టార్లలో కొత్త తోటల విస్తరణ సాధించామని, ఇప్పటివరకు రూ.181.28 కోట్ల నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ నూనె గింజల మిషన్ ద్వారా ఉచిత మొక్కలు, సాగు ప్రోత్సాహకాలు, అంతర పంటలకు సహాయం, బిందు సేద్యం పరికరాలపై రాయితీలు అందిస్తున్నామని, కూటమి ప్రభుత్వ లక్ష్యసాధక నిర్ణయాలతో ఆయిల్ పామ్ రాష్ట్ర రైతులకు స్థిరమైన, లాభదాయక ఆదాయ పంటగా మారుతోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ సంచాలకులు శ్రీనివాసులు, ఉద్యాన అదనపు సంచాలకులు, ఆయిల్ పామ్ VC & MD, AP ఆయిల్ ఫెడ్, ఆయిల్ పామ్ రైతులు మరియు ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జీఎస్టీ వసూలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సహకారం అందించాలి



**గుంటూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో జీఎస్టీ వసూలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం వాణిజ్య పన్నుల శాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా జిల్లాలో జీఎస్టీ సమర్థవంతంగా అమలుపై వాణిజ్య పన్నులు, రెవిన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ, ఇంజనీరింగ్, విద్యా, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జీఎస్టీ సమర్థవంతంగా వసూలు చేసేందుకు ప్రతినెల సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ శాఖలలో పనుల టెండర్లలో జీఎస్టీలో నమోదైన సంస్థలు మాత్రమే పాల్గొనేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పనులు నిర్వహించిన సంస్థలకు బిల్లులు మంజూరు సమయంలో జీఎస్టీ చెల్లింపులను పరిశీలించాలన్నారు. జీఎస్టీ చెల్లింపులలో అవకతవకలకు పాల్పడిన వారిపై కేసులు నమోదుకు వాణిజ్య పన్నుల శాఖకు పోలీస్ శాఖ అధికారులు సహకారం అందించాలన్నారు. మొండి బకాయిదారుల నుంచి నగదువసూలుకు రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుకు రెవిన్యూ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. వాణిజ్య పన్నుల శాఖకు వివిధ శాఖలలో అవసరమైన పూర్తి సమాచారాన్ని వెంటనే అందించాలన్నారు. ప్రభుత్వ శాఖలలో ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలను నిర్దేశించిన ఫార్మేట్లో అందించాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు డివిజన్ జాయింట్ కమిషనర్ బి గీతామాధురి జిల్లాలో జీఎస్టీకి సంబంధించి వివిధ శాఖలు అందించాల్సిన సమాచారం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, హౌసింగ్ పీడీ ప్రసాదు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, ఆర్ అండ్ బీ డెప్యూటీ ఎస్ఈ హజరతయ్య, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు, తెనాలి మున్సిపల్ కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు, జిల్లా జీఎస్ డబ్ల్యుఎస్ అధికారి సీహెచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భారత్-ఈయూ ఎఫ్టీఏను ప్రశంసించిన అంతర్జాతీయ మీడియా, ప్రపంచ దేశాల నాయకులు

**(రాజధాని వార్తలు):** భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా బలమైన, సానుకూల స్పందనలను పొందింది. అంతర్జాతీయ మీడియా, విదేశీ నేతలు, ప్రపంచ వ్యాపార ప్రముఖులు, విధాన నిపుణులు ఈఎఫ్టీఏను ప్రశంసించారు. ఆర్థికంగా, భౌగోళిక రాజకీయంగా వ్యూహాత్మకమైన ఈ చారిత్రాత్మక ఒప్పందం సరైన సమయంలో కుదిరిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్-ఈయూ ఎఫ్టీఏ పరిధిని, ఆశయాన్ని, వ్యూహాత్మక సమయాన్ని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థలు ప్రముఖంగా ప్రస్తావించాయి. 'వాణిజ్య ఒప్పందాలన్నింటి తలమానికమైన ఈయూతో జరిగిన వాణిజ్యం ఒప్పందంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే అసలైన విజేత' అంటూ జేమ్స్ క్రిస్ప్ రాసిన కథనం ద్వారా 'ది టెలిగ్రాఫ్' పత్రిక ఈ ఒప్పందాన్ని అత్యంత గొప్పదిగా అభివర్ణించింది. నిజమైన వ్యూహాత్మక విజేతగా భారత్ అవతరించిందని వాదించింది. భారత్?కు ఐరోపా సమాఖ్య చేసే ఎగుమతుల్లో 96.6 శాతంపై సుంకాలను ఈ ఒప్పందం తొలగిస్తుందని లేదా తగ్గిస్తుందని ఆ పత్రిక పేర్కొంది. అదే సమయంలో రాబోయే ఏడేళ్లలో భారతీయ వస్తువులపై 99.5 శాతం మేర సుంకాలను ఈయూ తగ్గించనున్నట్లు ప్రస్తావించింది. సుంకాల విషయంలో ఏర్పడిన అంతరాయాలకు మధ్యస్థాయి ఆదాయ దేశాలు ఇచ్చిన ప్రతిస్పందనగా ఈ ఒప్పందాన్ని 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' అభివర్ణించింది. అమెరికా వాణిజ్య విధానాల వల్ల తలెత్తిన అనిశ్చితి మధ్య తమ కూటములను భారత్, ఈయూ విస్తరించుకుంటున్న తీరును ఇది ప్రముఖంగా పేర్కొంది. దాదాపు రెండు దశాబ్దాల చర్చల తర్వాత ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక కూటమిని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థను ఈ ఒప్పందం ఏకం చేస్తుందని 'ది న్యూయార్క్ టైమ్స్' ప్రధానంగా చెప్పింది. దీనిని చారిత్రాత్మక ఒప్పందంగా 'ది వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది. 'చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో అన్ని ఒప్పందాలకే తలమానికం అయిన ఒప్పందాన్ని కుదుర్చుకున్న భారత్- ఈయూ' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది.

'అన్ని ఒప్పందాలకు తలమానికం': స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసిన ఈయూ, భారత్' అని 'ది గార్డియన్' పత్రిక పేర్కొంది. ఇదే విధమైన శీర్షికతో 'అన్ని వాణిజ్య ఒప్పందాలకు తలమానికమైన ఒప్పందాన్ని ప్రకటించిన భారత్, ఈయూ' అని బీబీసీ నివేదించింది. గతంలో కార్లపై 100 శాతం కంటే ఎక్కువ ఉన్న సుంకాలు 10 శాతం కంటే తక్కువకు పడిపోతాయని, వాహన విడిభాగాలపై సుంకాలు పూర్తిగా తొలగిపోనున్నట్లు పేర్కొంటూ సరఫరా వ్యవస్థ అనుసంధానం గురించి 'బ్లూమ్‌బెర్గ్' విశ్లేషించింది. 'ప్రపంచ వాణిజ్యంలో మూడో వంతుకు ప్రాతినిధ్యం వహించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్న భారత్, ఐరోపా సమాఖ్య' అనే శీర్షికతో 'అసోసియేటెడ్ ప్రెస్' ఈ ఒప్పంద పరిధిని ప్రధానంగా ప్రస్తావించింది. 'అన్ని ఒప్పందాలకు తలమానికం': భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం 27 ట్రిలియన్ డాలర్ల మార్కెట్?ను ఎలా సృష్టిస్తుంది' అని పేర్కొంటూ 'అల్ జజీరా' కూడా ఈ ఒప్పందానికి ఉన్న స్థాయిని పేర్కొంది. ఈ ఒప్పందాన్ని ఒక కీలకఘట్టంగా 'రాయిటర్స్' అభివర్ణించింది. 'మైలురాయి వంటి వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్న భారత్, ఈయూ- చాలా వస్తువులపై సుంకాలు భారీగా తగ్గింపు' అని వ్యాఖ్యానించింది. ఐరోపాకు చెందిన పలువురు సీనియర్ రాజకీయ నాయకులు ఈ ఒప్పందాన్ని బహిరంగంగా స్వాగతించారు. చర్చల ముగింపును ఒక 'అత్యంత సానుకూల సంకేతం'గా జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ అభివర్ణించారు. వృద్ధి, శ్రేయస్సును పెంచడానికి దీనిని త్వరగా అమలు చేయాలని ఆయన కోరారు. భారత్-ఈయూ ఎఫ్టీఏను చారిత్రాత్మకమైనదిగా, ఇరుపక్షాలు కుదుర్చుకున్న అతిపెద్ద వాణిజ్య ఒప్పందంగా ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ అభివర్ణించారు. ఇది ఆర్థిక, రాజకీయ సంబంధాలను గణనీయంగా బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. సహకారానికి సంబంధించిన కొత్త యుగానికి నాంది ఈ ఒప్పందం అన్న స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్సన్.. వాణిజ్యం - భాగస్వామ్యం ద్వారా శ్రేయస్సు, పోటీతత్వం, భద్రతను ఇది బలపరుస్తుందన్నారు. ఈ ఒప్పందం రెండు బిలియన్ల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే స్వేచ్ఛా వాణిజ్య మండలిని ఏర్పాటు చేస్తుందని ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ అన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచ క్రమంలో ఐరోపా దృఢత్వం కోసం ఇది ఒక ప్రధాన అడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందానికి పూర్తి మద్దతు తెలిపిన డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లక్కే రాస్మస్సేన్.. భౌగోళిక రాజకీయ పరిస్థితుల పరంగా ఇది అత్యంత కీలకమైనదని అన్నారు. రెండు బిలియన్ల ప్రజల ఉమ్మడి మార్కెట్‌లో మొదటగా ప్రవేశించే వారికి లభించే ప్రయోజనాన్ని ఆయన ప్రధానంగా చెప్పారు. భారత్-ఈయూ ఒప్పందాన్ని ఒక ప్రధాన రాజకీయ ముందడుగుగా పేర్కొన్న ఫ్రాన్స్ విదేశీ వాణిజ్య, ఆర్థిక శాఖ సహాయ మంత్రి నికోలస్ ఫోరిసియర్.. 'ఇది ఇతర ఒప్పందాల వంటిది కాదు' అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం భాగస్వామ్యాలను వైవిధ్యపరచుకోవాల్సిన, స్వయంప్రతిపత్తిని పెంచుకోవాల్సిన ఈయూ అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని ఐరోపా పార్లమెంట్ సభ్యుడు సాండ్రో గోజీ అన్నారు. భారత్‌ను ఒక ప్రధాన ప్రపంచ శక్తిగా పేర్కొన్న ఆయన.. భౌగోళిక రాజకీయ పరిస్థితులు, దౌత్యపరమైన కోణం నుంచి ఈ ఒప్పందం భారతీయులకూ, యూరోపియన్లకూ గొప్ప అవకాశాలను అందిస్తుందని అభిప్రాయపడ్డారు.

వ్యాపార దిగ్గజాలు, విధాన నిపుణులు

భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐరోపా, ప్రపంచ దేశాలకు చెందిన వ్యాపార నాయకులు ఈ ఒప్పందాన్ని ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఒక గొప్ప ముందడుగుగా అభివర్ణిస్తూ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 20 ఏళ్ల చర్చల తర్వాత ఈ ఎఫ్టీఏ కుదరటాన్ని ఒక 'గొప్ప క్షణం'గా ఎయిర్‌బస్ ఇండియా- దక్షిణాసియా ప్రెసిడెంట్- మేనేజింగ్ డైరెక్టర్, ఫెడరేషన్ ఆఫ్ యూరోపియన్ బిజినెస్ ఇన్ ఇండియా ప్రెసిడెంట్ జుర్గెన్ వెస్టర్‌మీర్ పేర్కొన్నారు. ఇది ఇరుపక్షాలకు అవకాశాలను వేగవంతం చేసే శక్తిగా పనిచేస్తుందని ఆయన అన్నారు. దీనినొక 'అద్భుతమైన రోజు'గా ఎయిర్‌బస్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు వౌటర్ వాన్ వెర్ష్ అభివర్ణించారు. 'భారత్‌లో తయారీ', సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, రక్షణ, అంతరిక్షం, అత్యాధునిక తయారీ రంగాల పట్ల ఎయిర్‌బస్ దీర్ఘకాలిక నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం రెండు బిలియన్ల ప్రజలను, ప్రపంచ జీడీపీలో దాదాపు నాలుగో వంతును ఏకం చేస్తుందని ఇండో-జర్మన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ జనరల్ జాన్ నోయెథర్ అన్నారు. 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలన్నింటికీ తలమానికం' అని ఆయన పేర్కొన్నారు.

ఫ్రాంక్ ష్లోడర్ (హేఫెలే దక్షిణాసియా కార్యనిర్వాహక అధ్యక్షులు), థామస్ వోల్టర్ (క్రోన్స్ మెషినరీ ఇండియా కార్యనిర్వాహక అధ్యక్షులు), లార్స్ ఎరిక్ జోహన్సన్ (ఆక్సియా జీఎంబీ హెచ్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు), జాన్-ఓలోఫ్ జాక్ (స్వీడిష్ ఎంటర్‌ప్రైజ్ కాన్ఫెడరేషన్ సీఈఓ), ఫ్రెడరిక్ పెర్సన్ (బిజినెస్ యూరప్ అధ్యక్షులు) వంటి ఇతర సీనియర్ వ్యాపార ప్రతినిధులు..

ఈ ఒప్పందాన్ని నియమ ఆధారిత వాణిజ్యం, సరఫరా వ్యవస్థ దృఢత్వం, ఎస్ఎంఈ వృద్ధి, దీర్ఘకాలిక పోటీతత్వానికి బలమైన సంకేతంగా పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని అంతర్గతంగా పటిష్ఠమైనదిగా, వ్యూహాత్మకంగా సరైన సమయంలో కుదిరినదిగా ప్రపంచ విధాన నిపుణులు, వ్యాఖ్యాతలు అభివర్ణించారు. ఈ ఒప్పందం ప్రపంచ జనాభాలో నాలుగో వంతును, ప్రపంచ వాణిజ్యంలో భారీ వాటాను.... దగ్గరకు తెస్తుందని సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐసీ) సీనియర్ సలహాదారులు రిచర్డ్ రోసో వ్యాఖ్యానించారు. దీనిలో సానుకూల దృక్పథంతో పాటు ఆలోచన కూడా బలంగా ఉందని ఆయన అన్నారు. ఇటీవల భారత్ కుదుర్చుకున్న ఎఫ్టీఏలు.. లోతైన, ప్రతిష్ఠాత్మకమైన వాణిజ్య హామీల వైపు స్పష్టమైన మార్పును తెలియజేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భారత్-ఈయూ ఎఫ్టీఏను 'సరైన సమయంలో కుదిరిన సరైన ఒప్పందం' అని అట్లాంటిక్ కౌన్సిల్ సీనియర్ ఫెలో మైఖేల్ కుగెల్మాన్ అన్నారు. ఇది కేవలం అమెరికా సుంకాల నుంచి రక్షణ పొందడమే కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సుస్థిరం చేస్తుందని ఆయన ప్రముఖంగా చెప్పారు.

# అర్హులైన అధికారుల నుండి దరఖాస్తులు

**అమరావతి, (రాజధాని వార్తలు):** కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) హోదాలోని మూడు (03) ఖాళీలను డిప్యూటేషన్ పద్ధతిలో భర్తీ చేయుటకు అర్హులైన అధికారుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నాయి. ఈ హోదా దేశంలో విపత్తు నిర్వహణ, అత్యవసర సహాయక చర్యలు మరియు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎంపికైన అధికారులు కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ వ్యవస్థలో వ్యూహాత్మక మరియు నిర్వాహక స్థాయిలో పనిచేస్తారు. ఈ హోదాకు వేతన శ్రేణి పే మేట్రిక్స్‌లో లెవల్-11 (67,700 - 2,08,700) గా నిర్ణయించబడింది. ఎంపికైన అధికారుల వేతనం మరియు ఇతర సర్వీస్ నిబంధనలు కేంద్ర సిబ్బంది మరియు శిక్షణ శాఖ ఆఫీస్ మెమొరాండం సంఖ్య 6/8/2009-Estt.(Pay-II), తేదీ 17.06.2010 మరియు ఆ తరువాతి సవరణల ప్రకారం అమలులో ఉంటాయి. డిప్యూటేషన్ పద్ధతిలో నియామకానికి గరిష్ఠ వయోపరిమితి 56 సంవత్సరాలు, మరియు డిప్యూటేషన్ కాలం సాధారణంగా మూడు సంవత్స రాలను మించరాదు. ఈ హోదా కింద ఎంపికైన అధికారుల ప్రధాన బాధ్యతలు - రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్ర మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేయడం ద్వారా విపత్తు పరిస్థితుల్లో అవసరమైన ఆర్థిక, లాజిస్టిక్ మరియు సాంకేతిక సహాయం అందించడం. రాష్ట్రాల నుండి వచ్చే సహాయక నిధుల అభ్యర్థనలను పరిశీలించడం, ఇంటర్-మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్లను విపత్తు ప్రభావిత ప్రాంతాలకు పంపించడం, కేంద్ర నిధుల విడుదలకు సంబంధించి విశ్లేషణ చేయడం వంటి అంశాలు ఇందులో ఉంటాయి. అదేవిధంగా విపత్తు పరిస్థితుల్లో SITREP తయారీ, డేటా సేకరణ మరియు విశ్లేషణ, సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు మరియు అంతర్జాతీయ సహకార కార్యక్రమాల నిర్వహణ కూడా ఈ హోదా బాధ్యతల్లో భాగంగా ఉంటాయి.

అర్హత ప్రమాణాలు: ఈ హోదాకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంత పరిపాలనలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాలు లేదా గుర్తింపు పొందిన పరిశోధనా సంస్థలలో పనిచేస్తున్న అధికారులు అర్హులు. అభ్యర్థి తన మాతృ విభాగంలో రెగ్యులర్ సేవలో ఉండాలి, లేదా లెవల్-10 (56,100 - 1,77,500) వేతన శ్రేణిలో కనీసం ఐదు సంవత్సరాలు రెగ్యులర్ సేవ చేసినవారై ఉండాలి.

విద్యార్హతలు: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం లేదా ఇన్స్టిట్యూట్ నుండి ఎకనామిక్స్, కామర్స్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ లేదా ఆపరేషన్స్ రీసెర్చ్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉండాలి. అదనంగా, ప్రభుత్వ కార్యాలయం లేదా పబ్లిక్ సెక్టార్ సంస్థ లేదా విశ్వవిద్యాలయం లేదా స్వయం ప్రతిపత్తి సంస్థలో ఐదు సంవత్సరాల గణాంక సేకరణ, విశ్లేషణ అనుభవం ఉండాలి.

ప్రాధాన్యతా అర్హతలు : విపత్తు నిర్వహణలో డిగ్రీ లేదా డిప్లొమా కలిగి ఉండటం, అలాగే కనీసం ఒక సంవత్సరం విపత్తు సహాయక చర్యల్లో అనుభవం ఉండటం.

దరఖాస్తు విధానం: అర్హులైన అధికారులు తమ దరఖాస్తులను రెండు ప్రతులలో నిర్ణీత ప్రోఫార్మాలో, సంబంధిత విభాగాధిపతి ద్వారా Proper Channel ద్వారా పంపవలెను. దరఖాస్తులకు విజిలెన్స్ & కేడర్ క్లియరెన్స్, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లు, మరియు గత ఐదు సంవత్సరాల ACRల ప్రతులు (ప్రతి పేజీపై రబ్బర్ స్టాంప్‌తో) తప్పనిసరిగా జతచేయాలి. దరఖాస్తులు Employment News పత్రికలో ఈ ప్రకటన ప్రచురితమైన తేదీ నుండి 60 రోజులలోపుగా Under Secretary (Ad-V), Ministry of Home Affairs, Hall No. 35076, 5th Floor, Kartavya Bhawan--3, New Delhi--110001 చిరునామాకు చేరవలసి ఉంటుంది.

చివరి తేదీ తరువాత అందిన దరఖాస్తులు, అసంపూర్ణ పత్రాలు ఉన్నవి లేదా అవసరమైన ధ్రువపత్రాలు లేని దరఖాస్తులు పరిగణించబడవు. ఎంపికైన అభ్యర్థులు తమ దరఖాస్తులను తరువాత ఉపసంహరించుకోవ డానికి అనుమతి ఇవ్వబడదు.

ధృవీకరణ మరియు నిబంధనలు: సంబంధిత విభాగం, అభ్యర్థి సమర్పించిన వివరాలు సరిగా ఉన్నాయని ధృవీకరించాలి. అదేవిధంగా అభ్యర్థిపై ఎటువంటి క్రమశిక్షణ చర్యలు పెండింగ్‌లో లేవని, గత పది సంవత్సరాలలో ఎటువంటి ప్రధాన/సూక్ష్మ శిక్షలు విధించబడలేదని ధృవీకరిం చాలి. అభ్యర్థి నిజాయితీ సర్టిఫికేట్ తప్పనిసరిగా జారీ చేయాలి.

# జగన్ పాదయాత్ర ఎందుకు?

**విజయవాడ, (రాజధాని వార్తలు):** వైఎస్ షర్మిలా రెడ్డి ఏపిసిసి చీఫ్. జగన్ పాదయాత్ర ఎందుకు? అధికారం కోసమే కదా ఈ పాట్లు? అధికారం ఇస్తే ఏం చేశారు? వైఎస్ఆర్ జలయజ్ఞం పూర్తి చేయగలిగారా? నవరత్నాల్లో పెట్టిన హామీలకు దిక్కులేదు. అధికారంలో వచ్చిన 6 నెలల్లో పూర్తి చేస్తా అన్నాడు. అధికారం ఇస్తే ఎందుకు పూర్తి చేయలేదు? మద్యనిషేధం అన్నాడు. అధికారం ఇస్తే కల్తీ మద్యం పెట్టి, క్యాష్ పద్ధతిలో మద్య మాఫియా చేశాడు. రుషికొండ వేల ఏళ్ల నుంచి నిలబడ్డ కొండ. రుషికొండను బోడి గుండు చేశాడు. అధికారం ఇస్తే ఒక్క రోజు కూడా బయటకు రాలేదు. ఆ పార్టీ వాళ్ళకే అందుబాటులో లేదు. ఎన్నికలకి 6 నెలల ముందు బయటకు వచ్చి సిద్ధం అంటూ కొన్ని నెలలు తిరిగారు.

అంతే తప్పిస్తే ఒకరోజు అయినా ప్రజల కోసం బయటకు వచ్చారా? అబ్రహాం లింకన్ ఒక మాట అన్నాడు. ఒక మనిషి నిజమైన నైజం తెలియాలి అంటే అధికారం ఇచ్చి చూడండి అన్నాడు. మనం జగన్‌ని అధికారంలో చూశాం. జగన్‌కి అధికారం సూట్ అవ్వలేదు. జగన్‌కి పవర్ సూట్ అవ్వలేదు. జగన్ నేచర్ మారాలి. జగన్ నైజం మారాలి. జగన్ లో మార్పు రావాలి. జగన్‌లో స్వార్థం తగ్గి మంచితనం పెరగాలి. అప్పుడు దేవుడు అధికారం ఇస్తాడేమో? అంతవరకు దేవుడు, ప్రజలు ఆశీర్వదించడు. ఏడాది న్నర తర్వాత చేసే పాదయాత్రకు ఇప్పుడు అనౌన్స్ ఎందుకు? చిత్తశుద్ధి లేని యాత్రలు ఎందుకు?

# మాపై చేసిన ఆరోపణలపై కోర్టును ఆశ్రయిస్తాం : వైవీ సుబ్బారెడ్డి



**ఢిల్లీ :** టీటీడీ దేవస్థానానికి సంబంధించి కల్తీ నెయ్యి అంశంపై సుప్రీం కోర్టు నియమించిన సిట్.. నెల్లూరు ఏసీబీ కోర్టులో ఛార్జ్ షీట్ సమర్పించిందని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఫైనల్ చార్జ్‌షీట్‌లో నెయ్యిలో కల్తీ జరిగిందని, కానీ జంతు కొవ్వు లేదని సిట్ చెప్పిందని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో స్వామివారికి సమర్పించే ప్రసాదంలో కూడా నెయ్యికి బదులు యానిమల్ ఫ్యాట్ వాడారని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారని గుర్తుచేశారు.

**భక్తులు ఆందోళనకు లోనయ్యారు..**

ప్రపంచ వ్యాప్తంగా ఉండే శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి వచ్చిందని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. దేశంలో ఎంతోమంది భక్తులు ఆందోళనకు లోనయ్యారని చెప్పుకొచ్చారు. స్వామి వారి ప్రసాదంలో జంతువు కొవ్వు కలిపారని వస్తున్న వార్తలపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయించానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే సిట్ విచారణపై తమకు నమ్మకం లేదని.. సుప్రీం కోర్టులో స్వతంత్ర దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ జరిపించాలని పిటిషన్ వేశానని ప్రస్తావించారు.

**లడ్డూలో జంతు కొవ్వు కలవలేదని సిట్ చెప్పింది..**

'విచారణ రిపోర్టు రాకుండానే రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు మాట్లాడటం సరికాదని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. తిరుపతి లడ్డూ విషయం ఎంతోమంది భక్తుల మనోభావాలకు సంబంధించింది. 2024 జూలైలో సప్లై చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందా లేదా అనే విషయం నిర్ధారణ చేయాలని సిట్ వేశారు. ఆ నెయ్యిని స్వామి వారి ప్రసాదంలో వాడారో లేదో తేల్చాలని సిట్ వేశారు. నెయ్యిలో కల్తీ జరిగింది, కానీ జంతువు కొవ్వు కలవలేదని స్పష్టంగా సిట్ చెప్పింది. వైసీపీ హయాంలో జూలైలో నాలుగు ట్యాంకర్లు వస్తే వాటిలో కూడా జంతువుల కొవ్వు కలవలేదని తేల్చి చెప్పారు. ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యిని సైతం వేరే రూపంలో టీటీడీకి సప్లై చేసి లడ్డూ తయారీలో వాడారు. నాపై, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. మాపై చేసిన ఆరోపణలపై కోర్టును ఆశ్రయిస్తాం' అని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

# ఒంగోలు బయో మైనింగ్ కేంద్రం ఆకస్మిక తనిఖీ

## - పనుల వేగం పెంచాలని అధికారులకు ఆదేశం



**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని కొప్పోలు బయోమైనింగ్ కేంద్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. లెగసీ వేస్ట్ పనులు జరుగుతున్న తీరుని నిశితంగా పరిశీలించారు. స్థానిక అధికారులు, కాంట్రాక్టర్ల నుంచి వివరాలు తెలుసుకున్నారు. పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఎఫ్ డిస్పోజల్ పై దృష్టి సారించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ, ఒంగోలు నగరంలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. రోజుకు 160 టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసే ఐఎస్‌డబ్ల్యూఎం (ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) కేంద్రం ఏర్పాటుకు తగిన స్థలం త్వరితగతిన సేకరించమని అధికారులను ఆదేశించారు. ఐఎస్ డబ్ల్యూఎం ద్వారా ఏ రోజు చెత్త ఆ రోజు ప్రాసెస్సింగ్ జరుగుతుంది. కొప్పోలు బయోమైనింగ్ కేంద్రంలో 61,929 మెట్రిక్ టన్నుల వేస్ట్ కోసం టెండర్లు పిలిచామని, అందులో 41 శాతం డిస్పోజల్ జరిగిందని చెప్పారు. అదనంగా 75,000 మెట్రిక్ టన్నుల వేస్ట్ తొలగింపు కోసం టెండర్ ప్రక్రియ జరుగుతోందని పట్టాభిరామ్ తెలిపారు.

# జగన్‌కు టీడీపీ ఎమ్మెల్యే చురకలు



**నంద్యాల, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టబోయే పాదయాత్రపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం శ్రీశైలంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలు చేస్తే.. చేసిన పాపాలు ఎక్కడికీ పోవంటూ వైఎస్ జగన్‌కు చురకలంటించారు. పాదయాత్ర చేసినా.. ఆ పాపాలు జగన్ వెంటే ఉంటాయన్నారు. ప్రజలకు ఏం తక్కువైందని మీరు పాదయాత్ర చేయబోతున్నారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమికి 164 సీట్లు వస్తే అందులో మీ కార్యకర్తలు కూడా తమకు ఓట్లు వేశారని అర్థం చేసుకోవాలని వైఎస్ జగన్‌కు సూచించారు. ఈ పాదయాత్ర ప్రజల కోసమా? లేకుంటే కార్యకర్తల కోసమా? చెప్పాలని జగన్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. టీటీడీ లడ్డులో కల్తీ నెయ్యిపై ఫైనల్ ఛార్జ్‌షీట్ సమర్పణ నేపథ్యంలో ఈ రోజు శ్రీశైలం ఆలయంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన పాపాలు తొలగిపోవాలని మల్లిఖార్జున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసినట్లు వివరించారు. తిరుమల ఆదాయం ఎక్కువగా ఉండటంతో అక్కడ అక్రమాలు చేశారని.. దేవుడి దయతో శ్రీశైలంలో జరగలేదని పేర్కొన్నారు. కలియుగం అంటే ఇలా ఉంటుందని వైసీపీ వాళ్లను చూస్తే అర్థమవుతోందని వ్యంగ్యంగా అన్నారు. వైసీపీ వాళ్లకు మంచి బుద్ధితో పాటూ వాళ్లలో మార్పు రావాలని మల్లిఖార్జున స్వామి, అమ్మవార్లను కోరుకున్నామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు.

# హజరత్ బాబా ఖాదర్ వలి 67వ ఉరుసు మహోత్సవాలు

### - మూడు రోజులూ లక్షకు పైగా భక్తులకు నిర్విరామ అన్న సమారాధన
### - తాగునీరు, భోజన, వసతి, లావెట్రీ సదుపాయాలు ఏర్పాట్లు పూర్తి ప్రెస్ మీట్లో ముతవల్లి ఖలీలుల్లా షరీఫ్, సూఫీ పీఠాధిపతి ఖ్వాజా మొహియుద్దీన్ వెల్లడి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** భారతీయ ఆధ్యాత్మిక లోకాన్ని శతకోటి సూర్య బింబాల తేజస్సుతో దేదీప్యమానం చేసిన విజయనగర ఆధ్యాత్మిక సూఫీ చక్రవర్తి హజరత్ సయ్యద్ షహిన్ షా బాబా ఖాదర్ వలి ర.అ. వారి 67వ సూఫీ సుగంధ మహోత్సవాలు (ఉరుసు) నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. గురు, శుక్ర, శనివారాల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉరుసు మహోత్సవాలకు దేశ, విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి మతాలకు, జాతులకు అతీతంగా సూఫీ భక్తులు లక్షలాది మంది విచ్చేస్తారని ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి(ధర్మకర్త) డాక్టర్ ముహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ తాజ్ ఖాదరీ(ఖలీల్ బాబు) వెల్లడించారు. ఈ మేరకు హజరత్ ఖాదర్ బాబా వారి ప్రియశిష్యులు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి సూఫీ పరంపర అభిషిక్త వారసులైన చీమలపాడు దర్గా దర్బార్ సూఫీ పీఠాధిపతి ముహమ్మద్ ఖ్వాజా మొహియుద్దీన్‌తో కలిసి విజయనగరం దర్బార్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖ్వాజా మొహియుద్దీన్ మాట్లాడుతూ, 850 సంవత్సరాల క్రితం హజరత్ బాబా ఖాదర్ మొహియునుద్దీన్ చిస్తీ వారు భారత దేశంలో కాలు పెట్టిన తర్వాత అఖండ భారతావనిలో ఒక సూఫీ ఆధ్యాత్మిక విప్లవం వచ్చిందన్నారు. ఆ పరంపరలో హజరత్ బాబా ఖాదర్ అవులియా వారు ఈ విజయనగరం పుడమిపై జన్మించిన తర్వాత రెండోసారి మరో ఆధ్యాత్మికమైన విప్లవం వచ్చిందన్నారు. యావత్ ప్రపంచంలోని కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రజలందరినీ సహృదయంతో తన వద్దకు లాక్కొని ఒక ఆధ్యాత్మిక సంపదను నింపిన వారిలో అగ్రగణ్యులు హజరత్ బాబా ఖాదర్ అవులియా వారని ప్రస్తుతించారు. ఎటువంటి వైద్య సదుపాయాలు లేని నాటి రోజుల్లో ఖాదర్ బాబా వారి కృపా దృష్టి రోగిపై పడితే ఎటువంటి రోగమైనా మటుమాయమైపోయేదని గుర్తు చేశారు. ఖాదర్ బాబా వారి ఒక మాట పలికితే అది జరిగి తీరేది, ఆయన మాటల్లోని మహాత్కార్యాలపై ఎందరో రచయితలు రచనలు చేసారని పేర్కొన్నారు. నేటి నుంచి అనగా గురువారం ఉదయం హజరత్ ఖాదర్ బాబా వారి శయన మందిరం (దర్గా) లో ఖురాన్ పఠనంతో ఈ ఉరుసు మహోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. అదే రోజు రాత్రికి బాబా వారికి శుద్ధి స్నానం (గుషల్) జరుగుతుందని చెప్పారు. ఆ రోజు మొదలయ్యే అన్న సమారాధన ఉరుసు మూడు రోజుల పాటు నిర్విరామంగా జరుగుతుందని తెలిపారు. జ్ఞాని ప్రసాదిస్తూ, స్వీకరిస్తున్నట్టు వినయంగా ఉంటాడు. అజ్ఞాని స్వీకరిస్తూ, ప్రసాదిస్తున్నట్టు అహంకారంతో ఉన్నట్టుగా ఖాదర్ బాబా తన పనిని తానే చేయించుకుంటున్నారు, తప్పు ఎవరూ చేసేది కాదని ఉపదేశించారు. రెండో రోజు అనగా పవిత్ర శుక్రవారం రోజు ఉదయం 10 గంటలకి ప్రధాన ఘట్టమైన సందల్ అనగా ఖాదర్ బాబా వారి చిత్ర పటం ఊరేగింపుగా నగర వీధుల్లోకి సందడిగా వెళ్తుందని తెలిపారు. బాబా వారు భౌతికంగా జీవించిన కాలం నుంచే అనాదిగా ఈ చిత్ర పటం ఊరేగింపు(సందల్) నగర వీధుల్లో ఘనంగా జరగడం విశేషం అని అభివర్ణించారు. బాబా వారిని వీక్షించడానికి వేలాది మంది భక్తులు ఈ ఉరుసు మహోత్సవాలకు రావడం ఇక్కడి ప్రత్యేకత అని వివరించారు. ఊరేగింపు నుంచి తిరిగి వచ్చాక దర్గాపై బాబా వారికి సుగంధ, చాదర్, పరిమళ ద్రవ్యాల సమర్పణ జరుగుతుందని తెలిపారు. మూడో రోజు భక్తులు అందరికీ బాబా వారి శేష వస్త్రాలు, తబురుక్ (ప్రసాదం) పంపిణీ కార్యక్రమాలతో 67వ ఉరుసు మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ ఉరుసు ఉత్సవాలకు దేశ నలుమూల నుంచి లక్షకు పైగా భక్తులు హాజరవుతారని, వారందరికీ అవసరమైన ఆహారం వసతి, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలన్నీ ధర్మకర్త ఖలీలుల్లా షరీఫ్ కల్పించడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, జర్నలిస్ట్ మిత్రులతో పాటు విచ్చేసి భక్తుల సహాయ సహకారంతో ఈ ఉత్సవాలు విజయవంతంగా జరుగుతాయని భావిస్తున్నామన్నారు. యావత్ భారత దేశానికి జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా సోదర భావానికి మత సామరస్యతకు విజయనగరం బాబామెట్ట ఒక వేదికగా ఈ ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ధర్మకర్త ఖలీల్ బాబు, టు టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అమ్మవారి అనుపోత్సవ కార్యక్రమం





**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలం శంబర గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవ కార్యక్రమం బుధవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అంతా అమ్మవారి ఘటాలను గ్రామంలో తిరువీధి కార్యక్రమం నిర్వహించి. వివిధ నృత్యాలు మేళతాళాలతో కోలాహలంగా ఊరేగించిన అనంతరం అమ్మ వారికి ఉయ్యాల కంబాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాన్ని ఆలయ ఆశదీయులు సాంప్ర దాయ ప్రకారం వివిధ రకాల కోలాటాలు డబ్బులు మంగళ వాయిద్యాలు నడుమ అమ్మవారి జయజయ ద్వారాలు మధ్య అమ్మవారి గద్దె నుండి వనం గుడి వరకు ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసిన తర్వాత అమ్మవారికి ఎదురుగా మొక్కుబడులను చెల్లించి శ్రీ పోలమాంబ అమ్మవారి ఘటాన్ని ఆలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నైదాన చిన్న తిరుపతి, ఆలయకార్య నిర్వహణ అధికారి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తీళ్ళ పోలినాయుడు, మాజీ చైర్మన్లు గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అమ్మవారి దర్శనార్థం దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పెద వాల్తేరు శ్రీ పోలమాంబ దేవాలయం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమించబడిన ధర్మ కర్తల మండలి సభ్యులంతా ఎండోమెంట్ చట్టాల ప్రకారం నడుచుకొని ఎటు వంటి అవినీతికి గానీ బంధు ప్రీతికి కానీ లోనవకుండా కేవలం భక్తులకు సౌకర్యాల కల్పన మీద దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన ధర్మ కర్తల మండలి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయడంతో పాటుగా సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. తమకు వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ధర్మకర్తల మండలి అధ్య క్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన మద్ది. శ్రీనివాస రెడ్డి మాట్లా డుతూ తనపై నమ్మకం ఉంచి తనను అధ్యక్షునిగా నియమించిన టీడీపీకి, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులుగా ఎ. మంగరాజు, పి. అనిల్ కుమార్, పి.వాసు, సిహెచ్.ఆనంద రెడ్డి, వి.శ్రీనివాస్, వి.పూర్ణ, కె.సత్య కౌసల్యా రాణి, ఎస్.ఎస్.శ్రీనివాసాచార్యులు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ మరడ శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ నాయ కుడు బొట్టా. వెంకట రమణ, పీతల. అమరేంద్ర, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి. పోతన రెడ్డి, పెద వాల్తేరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బైరెడ్డి గోవింద రెడ్డి, 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కంభాపు శివారెడ్డి, టిడిపి నాయకుడు గొరుసు అప్పల రెడ్డి, 17వ వార్డు టీడీపీ నాయకుడు కాళ్ల. శంకర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి గాయత్రి, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు. సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ప్రత్యేకాధికారి డా.రామ్ ప్రసాద్ తెలిపారు. పెద్దాపురం మండలం, గోరింట గ్రామంలో బుధవారం దివిలి నెటర్నరి డాక్టర్ మస్తాన్ బీ ఆధ్వర్యంలో ఎడిఎ టి.ఎన్.వి.ఎస్. తుమ్మల రామస్వామి అధ్యక్ష తన పశు ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రత్యేకాధికారి డా. రామ్ ప్రసాద్, పశు సంవర్ధక శాఖ డిడిలు అంబేద్కర్, కాంతారావులు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని, వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



అనంతరం 125 గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వచ్చిపాల సతీష్, డా. కళ్యాణి, డా. వినోద్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన భాష్యం స్కూల్ బస్సు

### - తప్పిన పెను ప్రమాదం - స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు
### - ప్రమాద సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులు - బస్సు డ్రైవర్ లైసెన్స్, బస్సు పర్మిట్ మూడు నెలలపాటు సస్పెండ్ చేసిన రవాణా శాఖ అధికారులు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం వద్ద భాష్యం స్కూల్ బస్సు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. హై వోల్టేజ్ విద్యుత్ వైర్లు ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిపోవటంతో పెను ప్రమాదం తప్పింది పక్కనే పంట కాలువ ఉండటంతో అదుపుతప్పి పంట కాలవలో పల్టీ కొడితే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. బస్సు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఒక్కసారిగా ఢీ కొట్టడంతో ఎదురుగా ఉన్న ముందు సీట్లు తగిలి, బస్సు అద్దాలు పగిలి మీద పడి పలు వురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. టేకుశెట్టిపాలెం వద్ద బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన సంఘటన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ పాఠశాల వద్దకు వెళ్లి ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. బస్సులో ఉన్న విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భాష్యం పాఠశాల బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన సంఘటనకు సంబంధించి జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాస్ రావు స్పందించారు. బస్సు పర్మిట్‌ను, డ్రైవర్ లైసెన్సును మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బస్సు డ్రైవర్‌ను విచారించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యా ర్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలని స్కూలు యాజమాన్యానికి సూచించారు. రహదారి భద్రత ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# విద్యార్థులకు స్టడీ చైర్స్, పబ్లిక్ పరీక్ష సామాగ్రి పంపిణీ

### - శ్రీ మోసుగంటి గంగయ్య మెమోరియల్ ట్రస్ట్, శ్రీ రుద్రరాజు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా వితరణ




**అల్లవరం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమర గిరిపట్నంకు చెందిన శ్రీ మోసుగంటి గంగయ్య మెమోరియల్ ట్రస్ట్, శ్రీ రుద్రరాజు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా పదవ తరగతి పాఠశాల విద్యార్థులకు స్టడీ చైర్స్, పబ్లిక్ పరీక్ష సామాగ్రిని ఉచితంగా అందజేశారు. సాకురు శ్రీ వేదుల విశ్వనాథం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన సర్పంచ్ గుత్తుల చిరంజీవి రావు ముఖ్య అతిథులుగా బుధవారం జరిగిన సమావేశంలో విద్యార్థు లకు ఉచితంగా స్టడీ చైర్స్, పబ్లిక్ పరీక్ష మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాత మోసుగంటి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి కష్టపడి చదివి మంచి ఉన్నత స్థానానికి వెళ్లి మీ పాఠశాలకు, మీ కుటుంబానికి, మీ గ్రామా నికి మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా మండల స్థాయిలో పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి నగదు బహుమానం రూ. 10,000/- అందజేస్తానని తెలిపారు. పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు సౌకర్యాలు ఏర్పాటు చేసిన మోసుగంటి వెంకటేశ్వరరావు దంపతులకు, రుద్రరాజు రమేష్ రాజుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపి సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పొలమూరి బాలకృష్ణ, మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చొల్లంగి సాయి బాబు, జనసేన పార్టీ నాయకులు కొలిశెట్టి కుమార్, సాకుర్రు సొసైటీ డైరెక్టర్ ముత్తాబత్తుల రమణ, అజ్జరపు శేషగిరిరావు, పాఠశాల ఉపాధ్యాయులు సరిదే సత్య పల్లంరాజు, గరిమెళ్ళ సత్య శ్రీనివాస్, ఉప్పె సత్యనారాయణ మూర్తి, జల్లి నాగ దుర్గ, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## గణ రాజ్యమా? గణతంత్రమా?

భారత రాజ్యాంగం మన రిపబ్లిక్‌ను గణ రాజ్యంగా పేర్కొంది. భారత పౌరుల పాస్‌పోర్ట్‌లో కూడా గణ రాజ్యం అనే ఉంటుంది. అయితే మన రిపబ్లిక్ డే (జనవరి 26)ను అధికారికంగా భారత గణతంత్ర దినోత్సవంగా పిలవడం ఆనవాయితీగా ఉంది. ఇదొక చిన్న వ్యత్యాసం మాత్రమేనని మీరు భావించవచ్చు. బహుశా, అజాగ్రత్త వల్ల సంభవించిన అనాలోచిత తప్పిదంగా మీరు ఉపేక్షిస్తుండవచ్చు. ఒక సూక్ష్మమైన తేడాగా మీరు పరిగణిస్తుండవచ్చు. మన ప్రజాస్వామ్య వర్తమానం, భవితవ్యం గురించి నేను హిందీలో రాసిన పుస్తకం శీర్షిక 'గణరాజ్య కా స్వధర్మ్'. ఆ శీర్షిక 'గణ తంత్ర కా స్వధర్మ్'గా ఉండాలని ప్రచురణకర్త ప్రతిపాదించారు. అయితే నేను పెట్టిన శీర్షికను మార్చవద్దని గట్టిగా చెప్పినప్పుడు ఆయన అభిప్రాయాలు పైన ప్రస్తావితమయినట్టుగా ఉన్నాయని నాకు అర్థమయింది. ఇది చాలా చిన్న తేడాగా కనిపిస్తుండవచ్చు గానీ ఆ స్వల్ప భేదాన్ని లోతుగా శోధించవలసి ఉన్నది. ఎందుకంటే గణతంత్రం, గణరాజ్యం అనేవి రెండు విభిన్న భావనలు. ఆ రెండిటికీ ఆంగ్లంలో ఒకే ఒక్క పదం ఉన్నది. ఆ మాట 'రిపబ్లిక్'. బాగా సుపరిచితమైన, ఆధిపత్య భావన అయిన గణతంత్రం నుంచి గణరాజ్యం భావనను వేరు చేయవలసిన అవసరమున్నది. అలా వేరు చేసినప్పుడే గణరాజ్యం భావనలో ఉన్న విశిష్ట అర్థాలను విశదం చేసుకోగలుగుతాము. మరీ ముఖ్యంగా మన గణరాజ్యం భావన కోల్పోయిన ఆ అర్థాలను మనం తిరిగి సాధించుకోగలుగుతాము. తద్వారా ఇప్పుడు మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోగలుగుతాము. భారత గణ రాజ్యాన్ని సమున్నతం చేసుకునేందుకు ఇది అత్యవసరం. నేడు వాడుకలో ఉన్న ఈ రెండు పదాలలో ఒకటి తప్పు అని నేను సూచించడం లేదు. ఈ రోజుల్లోని నాయకుల వలే కాకుండా మన రాజ్యాంగ నిర్మాతలు, మన రిపబ్లిక్ తొలి సంరక్షకులు తాము ఉపయోగించే పదాల విషయంలో చాలా జాగ్రత్తగా, వివేచనాయుతంగా ఉండేవారు. జనవరి 26ను గణరాజ్య దినోత్సవంగా కాకుండా గణతంత్ర దినోత్సవంగా వారు పిలవడానికి సహేతుకమైన కారణాలు ఉండివుంటాయి. ఆ రెండు పదాలలో ఒకటి రెండో దాని కంటే మరింత ప్రామాణికమైనదని నేను చెప్పడం లేదు. నిజానికి గణతంత్రం, గణరాజ్యం అనే పదాలు ఇటీవలి కాలానివి (19 లేదా 20వ శతాబ్దానివి)అని సంస్కృత భాషా కోవిదులు చెబుతుంటారు. పురాతన భారతదేశంలో రిపబ్లిక్‌లను 'గణరాజ్య' లేదా 'గణతంత్ర' అని కాకుండా 'గణ' లేదా 'సంఘ' అని మాత్రమే పిలిచేవారు. ఈ పదాలకు చారిత్రక వాస్తవాలు అయిన ప్రాచీన భారత 'గణాల'కు మధ్య ఒక ప్రత్యక్ష సంబంధమున్నదని నేను వాదించడం లేదు. ఆ పురాతన రాజకీయ నిర్మాణాలను ఆధునిక ప్రజాస్వామిక గణ రాజ్యాలతో పోల్చవద్దని చరిత్రకారులు హెచ్చరిస్తున్నారు. బుద్ధుడి కాలంలోని వైశాలి, లిచ్ఛవీ గణ రాజ్యాలు వంశపారంపర్య కులీన పాలనా వ్యవస్థలే గానీ మనం అర్థం చేసుకునే ఆధునిక ప్రజాస్వామ్యాలు కానే కావు. చెప్పవచ్చినదేమిటంటే గణతంత్రం, గణ రాజ్యం భావనల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి, వాటి ప్రత్యేకతలను, అవి పురిగొల్పే భిన్న రాజకీయ సంభావ్యతలను అర్థం చేసుకుని, మన ప్రజాస్వామ్య వర్తమాన సమస్యలను అధిగమించేందుకు స్ఫూర్తి పొందాలి. గణతంత్రం అనేది ఒక రిపబ్లిక్‌కు ఉన్న ప్రతికూల, సంకుచిత అర్థాన్ని సూచిస్తుంది. రాజ్యాధిపతిగా ఉండే వ్యక్తి జన్మహక్కు ద్వారా నిర్ణయింపబడని ప్రభుత్వ వ్యవస్థ ఉన్న దేశం గణతంత్ర రాజ్యమని రాజనీతి శాస్త్ర పాఠ్య గ్రంథాలు మనకు చెబుతాయి. బ్రిటన్‌ను రాజు/ రాణి పరిపాలిస్తుంటారు. కనుక అది రిపబ్లిక్ కాదు. నేపాల్ రాచరికాన్ని రద్దు చేసింది. అది ఇప్పుడు ఒక రిపబ్లిక్. చాలా తక్కువగా ఉన్న నామమాత్ర రాచరికాలను మినహాయిస్తే ఇప్పుడు ప్రతి దేశమూ ఒక ప్రజాస్వామిక లేదా మరో తరహా రిపబ్లిక్‌గా ఉన్నది. గణతంత్రను కొన్నిసార్లు ఒక విశాల అర్థంలో వాడుతుంటారు. కేవలం రాచరికం లేకపోవడం అనే రాజకీయ వాస్తవాన్నే కాకుండా ప్రజా సార్వభౌమత్వ వ్యవస్థను సూచించేందుకు కూడా దాన్ని ఉపయోగిస్తారు. ప్రజా సార్వభౌమత్వానికి ప్రాతిపదిక అయిన ఎన్నికల ప్రజాస్వామ్య సంస్థాగత నిర్మాణాలను వివరించేందుకు గణతంత్ర భావనను ఉపయోగిస్తారు. ఈ విశాల అర్థంలో గణతంత్ర, లోక్‌తంత్ర లేదా ఎన్నికల ప్రజాస్వామ్యానికి ఒక పర్యాయపదం. అయితే ఇదొక అలంకారిక వ్యక్తీకరణగా మిగిలిపోతోంది. మన రాజకీయ భావనాశక్తి వికాసానికి దోహదం చేసేదిగా ఉండడం లేదు. గణ తంత్రకు భిన్నంగా గణరాజ్యం మనలను ఒక రిపబ్లిక్ భావనలో ఉన్న సానుకూల, అభ్యుదయాత్మక భావాలు, ఆశయాలకు తీసుకువెళ్తుంది. ఈ ప్రకారం గణరాజ్యం ఒక సాధారణ రాజకీయ వ్యవస్థ. ఈ వ్యవస్థలో సంఘం అంటే కేవలం వ్యక్తుల సముదాయం కాదు, సమానుల సమాజం. తమ సమష్టి వ్యవహారాల నిర్వహణకు స్వంత నిబంధనలను, ఒక విశిష్ట ధర్మాన్ని రూపొందించుకునే సమానుల సమాజం. పౌర ధర్మాలను పెంపొందించడం ద్వారా అది ఆ విశిష్ట ధర్మాన్ని స్థిరపరుస్తుంది. పాలకులను జవాబుదారీగా చేయడం ద్వారా ప్రజలు సమష్టి సంకల్పంతో ఆ ధర్మాన్ని అమలుపరుస్తారు. ప్రజలు కేవలం అధికారానికి మూలం మాత్రమే కాదు, దాన్ని సక్రమంగా ఉపయోగించేలా నియంత్రించే, ప్రభావితం చేసే శక్తులు కూడా. పౌర ధర్మం, స్వపరిపాలన, ఏకపక్ష అధికారం నుంచి స్వేచ్ఛ సమానుల సమాజం లక్ష్యంగా ఉంటుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజా సార్వభౌమాధికారమే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. యూరోపియన్ 'రిపబ్లికనిజం' సంప్రదాయాలు ప్రజా సార్వభౌమత్వానికి నిబద్ధమైనవి. ఇటీవలి సంవత్సరాలలో పాశ్చాత్య రాజనీతి చింతనలో ఒక మౌలిక మార్పు చోటు చేసుకున్నది.

# అర్హులైన వారందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాల్సిందే

## - వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే ఫెడరేషన్ లక్ష్యం - నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా ప్రారంభం - వారం రోజులు పాటు ప్రత్యేకంగా నిర్వహణ



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ ఎ జె). గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు తెలిపారు. బుధవారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవో హోంలో 2026 వార్షిక సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గంట్ల శ్రీనుబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నూతన సభ్యత్వాలు రెన్యువల్సు ప్రక్రియను వారం రోజులు పాటు నిర్వహిస్తామన్నారు. గత ఏడాది 600 మంది జర్నలిస్టులు తమ యూనియన్‌లో సభ్యులుగా చేరినట్లు వీరు చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు ఫెడరేషన్ బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల జర్నలిస్టులకు తమ యూనియన్ ద్వారా చేయూతను అందిస్తామన్నారు. ఈ ఏడాది అర్హులైనవారందరికీ అక్రిడేషన్లు జారీ చేయాలని, ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని, ఇతర రాష్ట్రాలు మాదిరిగా సీనియర్ జర్నలిస్టులకు పింఛన్ పథకం అమలు చేయాలని, ప్రమాద బీమా పునరుద్ధరణ హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు వాటి అమలకు వివిధ కమిటీలను కూడా తక్షణమే నియమించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు.

జర్నలిస్టుల సంక్షేమంతో పాటు అన్ని రకాల పండుగల నిర్వహణ అలాగే వన సమారాధన విద్యా వైద్యానికి కూడా తమ పరిధి మేరకు కృషి చేస్తున్నట్లు వీరు చెప్పారు. యూనియన్ ద్వారా వర్కింగ్ జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ చేయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క సభ్యుడు యూని యన్ నియమిబంధనలు పాటించాలని.. అలా కాకుండా సొం తంగా నిర్ణయాలు తీసుకుంటే ఎనిమిది మందితో కూడిన క్రమశిక్షణ సంఘం కు సిఫార్సు చేయడం జరుగుతుంది అన్నారు. అనంతరం నూతన రెన్యువల్స్ కార్డులను సభ్యులకు వీరి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లాకార్యదర్శి జి.శ్రీనివాసరావు ఏపీబీజేఏ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.సాంబశివరావు, ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్, జాయింట్ సెక్రటరీలు నగేష్, శ్రీనివాసనాయుడు, కిషోర్, మధురవాడ ఆనంద్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బొబ్బర ప్రసాద్, కె.వి.శర్మ, చక్రి తదితరులు పాల్గొన్నారు.



# విశాఖ నగర పోలీస్ కమిషనర్‌కి కృతజ్ఞతలు తెలిపిన మహిళ




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళకు, తను గతంలో పనిచేసిన ఆఫీస్ వారు తనకు రావలసిన జీతం బకాయిలు ఇవ్వటం లేదని, ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆమె డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్. కమిషనర్ ఆఫ్ పోలీస్ మరియు అదనపు జిల్లా మెజిస్ట్రేట్‌ని కలిసి తన సమస్యను తెలియజేశారు. అనంతరం సీపీ ఆదేశాల మేరకు మహారాణిపేట పోలీస్ స్టేషన్ సీఐ దివాకర్ యాదవ్ ఆ ఆఫీస్ యాజమాన్యాన్ని పిలిపించి, వారితో మాట్లాడి ఆమెకు రావలసిన జీతం బకాయిలు ఇప్పించారు. తనకు సహాయం చేసిన సీపీకి మరియు మహారాణిపేట పోలీస్ స్టేషన్ సీఐకి సదరు మహిళ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గీతం భూ కబ్జాపై 30న మహాధర్నాను జయప్రదం చేయండి

## - 30న జీవీఎంసి వద్దకు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి పిలుపు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ గీతం యూని వర్సిటీకి ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న జీవీఎంసి గాంధీ విగ్రహం వద్ద 11 గంటలకు జరిగే మహాధర్నా జయప్రదం చేయాలనీ మాజీ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కోరారు. ఆసీలమెట్ట పార్టీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజీవ్ గాంధీతో కలిసి దక్షిణ శ్రేణుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ రూరల్ మండలం, ఎండాడ, ఋషికొండ గ్రామాల్లోని గీతం అక్రమణలో ఉన్న విలువైన 54.79 ఎకరాలు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గీతం విశ్వ విద్యాలయం, గీతం హాస్పిటల్ యాజమాన్యం ఆక్రమణలో ఉన్న విశాఖపట్నం రూరల్ మండలం ఎండాడ గ్రామ సర్వే నెం. 15/1నుండి 15/5 వరకు 24.51 సెంట్లు, 16/4 లో 1.95 సెంట్లు, 17/27 లో 1.01 సెంట్లు, 17/30 లో 1.09 సెంట్లు, 18/2 లో 1.03 సెంట్లు, 20/5 లో 5.60 సెంట్లు, 20/10 లో 1.50 సెంట్లు, 20/12 లో 0.10 సెంట్లు, 191/1 లో 0.48 సెంట్లు, 191/2 లో 0.86 సెంట్లు, 191/9 లో 0.70 సెంట్లు వెరసి మొత్తం విస్తీర్ణం 42 ఎకరాల 39 సెంట్లు వుందని తెలిపారు.ఋషికొండ గ్రామ సర్వే నెం37/2 లో 4.29 సెంట్లు, 38/1బి లో 7.27 సెంట్లు, 53/4 లో 0.03 సెంట్లు,55/3 లో 0.35 సెంట్లు, 61/5 లో 0.40 సెంట్లు,61/5 లో0.06 సెంట్లు వెరసి మొత్తం విస్తీర్ణం 12 ఎకరాల 40 సెంట్లు, వుందని పేర్కొన్నారు. రెండు గ్రామాల్లోని మొత్తం విస్తీర్ణం 54 ఎకరాల 79 సెంట్లు ఉంటుందని, వీటి విలువ 5 వేల కోట్లని అయన గుర్తు చేశారు. ఈ భూమిని



రెగ్యులైజేషన్ చేసుకోవడానికి ఈనెల 30 వ తేదిన జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం కోసం 15 వ ఎజెండాగా పెట్టారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా అప్రజాస్వామ్యం అని దుయ్యబట్టారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రభుత్వం, ప్రజలు ఆస్తులు కాపాడవలసినదిపోయి అధికారం అడ్డం పెట్టుకొని ప్రభుత్వం భూములు హారతి కర్పూరంలా స్వాహా చేసే పద్దతి ఆపాలని ఆయన కోరారు. గీతంకి ప్రభుత్వ భూములు సంతర్పణ చేయడానికి అక్కడ ఉచిత విద్య అందుబాటులో లేదని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ఎంపీ పదవిలో వున్నా శ్రీభరత్ ఇటువంటి చర్యలకు పాల్పడడం దురదృష్టకరం అన్నారు. మహా ధర్నాకి వైసిపి నేతలు, కార్యకర్తలు అన్ని అనుబంధ సంఘాలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో దక్షిణ వార్డు ప్రెసిడెంట్లు అనుబంధ సంఘాల నాయకులు సీనియర్ నాయకులు మహిళా నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి పథకానికి మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలి : కౌలు రైతుల సంఘం



**కాజులూరు, (రాజధాని వార్తలు):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును యథావిధిగా కొనసాగించాలని, అలాగే పథకానికి సంబంధించిన పూర్తి బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం భరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష–కార్యదర్శులు ఎం. రాజశేఖర్, వలువు రాజబాబు డిమాండ్ చేశారు. కాజులూరు, శీలలంక గ్రామాల్లో ఉపాధి కూలీలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి మెమొరాండం అందజేసిన సందర్భంగా వారు మాట్లాతూ 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం కాలంలో వామపక్షాల దీక్షలు, పోరాటాల ఫలితంగా ఈ చట్టం సాధ్యమైందని, అప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల ఉపాధి కూలీలకు జీవనోపాధిపై శుభప్రభావం పడిందని పేర్కొన్నారు. 2014 తర్వాత ఉపాధి హామీ పథకానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారీగా బడ్జెట్ కోతలు పెట్టి, ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు తగ్గిస్తూ వస్తోందని విమర్శించారు. తాజాగా ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించి, జి.బి. రాంజీ పేరును పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటివరకు 90% నిధులు కేంద్రం భరించగా, ఇప్పుడు 60% మాత్రమే భరించి, మిగిలిన 40% (సుమారు 3,000 కోట్లు) రాష్ట్రాలు భరించాలన్న కేంద్ర నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాలపై భారీ భారం మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రానికి ఎదురు నిల బడకుండా అడుగులకు మడుగులు వేస్తున్నందున పేద ప్రజలే నష్టపోతున్నారని విమర్శించారు. పథకా నికి మళ్లీ మహాత్మా గాంధీ పేరును పెట్టాలని, నిధు లను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించాలని, ఉపాధి కూలీలకు ప్రతిరోజూ రూ.600లు వేతనం మరియు 200 పని దినాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# గ్రామాలను అప్రమత్తం చేసేందుకు పల్లె నిద్ర



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాలకు భద్రత కల్పించడం పల్లెనిద్ర కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం అని సిఐ ఎ కృష్ణ భగవాన్ అన్నారు. మంగళవారం రాత్రి నుండి బుధవారం ఉదయం 6 గంటల వరకు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని వికె రాయపురం గ్రామంలో గ్రామ సర్పంచి సర్వేశ్వర రావు అధ్యక్షతన నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావుతో కలసి నిర్వహించిన పల్లెనిద్రలో గ్రామంలో జరిగే రోడ్డు ప్రమాదాలు, మహిళలు, పిల్లల భద్రత, వివాదాలు, వేధింపులు, దొంగతనాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నాము. మహిళలు, పిల్లల భద్రతకు సంబంధించి లైంగిక నేరాలు, ఈవ్–టీజింగ్, గృహ హింస, సైబర్ నేరాల నివారణపై ఆయన అవగాహన కల్పించి డయల్–112, మహిళా హెల్ప్ డెస్క్ వివరాలను తెలిపి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అలాగే గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన శిక్షలపై అవగాహన కల్పించడంతో పాటు, బాల్య వివాహాల నివారణపై ప్రజలకు సూచనలు ఇచ్చారు. వీధి తగాదాలు, మద్యపాన వేధింపులపై సమాచారం సేకరించి తగిన సూచనలు అందించారు. అయితే ఎవరైనా నేరాలకు పాల్పడితే రౌడీ, సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేయబడుతుందని ఆయన హెచ్చరించాము. ఈ సందర్భంగా గ్రామంలో శాంతి భద్రతలు మెరుగుపడేందుకు గానూ సర్పంచితో కలిసి 10 మంది సభ్యులతో గ్రామ శాంతి కమిటీని ఏర్పాటు చేసారు. అలాగే వికె రాయపురం గ్రామంలో గతంలో జరిగిన కేసులు, కౌంటర్ కేసుల వివరాలను ప్రజలకు తెలియజేసి జాగ్రత్తలు సూచించాము. రాత్రి 10 నుండి 12 గంటల వరకు మద్యం దుకాణాలు, జూదం ప్రదేశాలు, పాఠశాల పరిసరాలు వంటి హాట్‌స్పాట్ ప్రాంతాలను తనిఖీ చేసినాము. ఒంటిగంట వరకు రౌడీషీటర్లు, అనుమానితులు, పునరావృత నేరస్థుల కదలికలపై నిఘా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**కరప, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒక రోజు ముందుగానే పంపిణీ చేయనున్నట్లు కరప మండల అభివృద్ధి అధికారి జటావల్లభుల్ల శ్రీనివాస్ తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో, జనవరి 31వ తేదీ శనివారం పెన్షన్ల పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. శనివారం 31వ తేదీ సచివాలయ సిబ్బంది పెన్షన్ లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి నేరుగా పెన్షన్లను అందజేస్తారని, కావున అన్ని పెన్షన్ లబ్ధి దారులు ఆ రోజు తమ నివాసాల్లో అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా లబ్ధిదారులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్ల పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

# యష్ తగ్గేదేలే.. ఆ విషయంలో నో ఛేంజ్!



ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం విడుదల తేదీలపై ఫుల్ డిస్కషన్ నడుస్తోంది. పెద్ద సినిమాలన్నీ తమ షెడ్యూల్లను మారుస్తూ, క్లాష్ తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నాయి. కానీ ఆ ట్రెండ్‌కు భిన్నంగా స్టార్ హీరో యష్ నటిస్తున్న భారీ చిత్రం టాక్సిక్ మేకర్స్ మాత్రం తమ నిర్ణయంపై గట్టిగా నిలబడ్డారు. తమ మూవీ రిలీజ్ డేట్ మార్చి 19 అని చెబుతూనే ఉన్నారు. కేజీఎఫ్ సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యష్, మరోసారి బాక్సాఫీస్ పై కన్నేశారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇతర హీరోలు, నిర్మాతలు పోటీ భయంతో విడుదల తేదీలు మార్చుకుంటున్నా, యష్ మాత్రం ఎలాంటి వెనకడుగు వేయడం లేదని అభిమానులు సంబరపడుతున్నారు. కేజీఎఫ్ తర్వాత యష్ ఎవరినీ భయపడరంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. అయితే యష్ మార్చి నెలను ఎంచుకోవడం వెనుక స్ట్రాంగ్ లాజిక్ ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మార్చి అంటే సమ్మర్ సీజన్ కు ఆరంభం అన్న విషయం తెలిసిందే. అది స్కూల్, కాలేజ్ హాలిడేలు మొదలయ్యే సమయం కూడా.. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే టైమ్ అది.. అదే సమయంలో పాన్ ఇండియా సినిమాలకు అనుకూలమైన మార్కెట్ మార్చి అనే చెప్పాలి. అందుకే ఆ డేట్‌ను వదులుకోకుండా మేకర్స్ ముందుకెళ్తున్నారని సమాచారం. ముఖ్యంగా నార్త్ టు సౌత్.. యష్ కు ప్రస్తుతం ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని, సినిమా భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందనే నమ్మకంతోనే నిర్ణయం తీసుకున్నారట. అయితే ఇదంతా ఒక వైపు అయితే, మరోవైపు క్లాష్ భయం కూడా లేకపోలేదు. అదే సమయంలో ఇతర భారీ సినిమాలు విడుదలవుతున్నాయి. ముఖ్యంగా మార్చి 19వ తేదీన ధురంధర్ సీక్వెల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ హిట్‌గా ఫస్ట్ పార్ట్ నిలవగా.. ఇప్పుడు సీక్వెల్ పై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఆ తర్వాత వీక్‌లో పెద్ది, ప్యారడైజ్ లేదా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా రానుంది. దీంతో కలెక్షన్లు డివైడ్ అయ్యే అవకాశం ఉంది. కానీ కంటెంట్‌పై నమ్మకంతో టాక్సిక్ మేకర్స్ ఉన్నారట. అందుకే డేట్ మార్చడం లేదని తెలుస్తోంది. ఇక టాక్సిక్ విషయానికొస్తే.. యష్ కెరీర్‌లో చాలా కీలకమైన సినిమా. కేజీఎఫ్ ఇమేజ్ ను మించి, కొత్త తరహా కథ, కొత్త స్టైల్‌లో ఆయన కనిపించబోతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ అయిన టీజర్, లుక్ పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మూవీ సూపర్ హిట్ అవుతుందని అంచనాలు ఉన్నాయి. అదే జరిగితే.. యష్ మార్కెట్ మరింత పెరగడం ఖాయం. మరి చూడాలి సినిమా ఎలాంటి హిట్ అవుతుందో..

# అనిల్ రావిపూడికి నెక్స్ట్ సినిమా లైన్ అక్కడ దొరికిందా..?



సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడిని ప్రస్తుతం టాలీవుడ్ హిట్ మిషన్ అని అందరు అంటున్నారు. ఆయన తీసిన సినిమా పండగకి రావడం హిట్టు కొట్టడం ఇది రిపీట్ అన్నట్టుగా ఉంది. పటాస్ నుంచి రీసెంట్ రిలీజ్ మన శంకర వరప్రసాద్ వరకు అనిల్ రావిపూడి సినిమా అంటే ఆడియన్స్ పక్కా హిట్టే అనే రేంజ్ క్రేజ్ తెచ్చుకున్నాడు. ముఖ్యంగా చిరంజీవి రీ ఎంట్రీ తర్వాత ఎం.ఎస్.జి లాంటి ఫ్యాన్ ఫీస్ట్ హిట్ అందించడంతో అతని రేంజ్ మరింత పెరిగింది. అనిల్ రావిపూడి 9 సినిమాలు తీసి 9 సక్సెస్ అందుకున్నాడు. ఈ డైరెక్టర్ నెక్స్ట్ సినిమా ఎవరితో అన్న డిస్కషన్ అయితే జోరుగా నడుస్తుంది. ఐతే రీసెంట్ ఇంటర్వ్యూలో అనిల్ నెక్స్ట్ సినిమా కథ లైన్ సెట్ అయ్యిందని అన్నాడు. తాను ఎప్పుడు కథ రాయాలని అనుకున్నా వైజాగ్ వెళ్తానని చెప్పిన అనిల్ రావిపూడి. వైజాగ్ ఫ్లైట్ దిగగానే ఒక లైన్ తట్టింది. అక్కడ తన టీంతో బీచ్‌లో డిస్కస్ చేసి ఫైనల్ చేసినట్టు చెప్పుకొచ్చారు. డైరెక్టర్స్‌కి ఒక్కొక్కరికి ఒక్కోచోట స్టోరీ సిట్టింగ్స్ జరుగుతాయి. ఒకప్పుడు ఇండస్ట్రీని షేక్ చేసిన డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ఏ కథ రాయాలన్నా సరే బ్యాంకాక్ వెళ్లేవాడు. అనిల్ రావిపూడి మాత్రం వైజాగ్ వెళ్తే చాలు అలా కథ రాసుకొచ్చేస్తాడు. సో లైన్ ఓకే ఇక దానికి తారాగణం ఎవరన్నది ఎంపిక చేయాల్సి ఉంది. అనిల్ రావిపూడి నెక్స్ట్ సినిమా హీరో ఎవరన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఇప్పటికే విక్టరీ వెంకటేష్‌తోనే సంక్రాంతికి వస్తున్నా సీక్వెల్ చేస్తారని సోషల్ మీడియాలో హంగామా నడుస్తుంది. ఐతే చిరంజీవి సినిమాలో కూడా తన లక్కీ సెంటిమెంట్‌గా వెంకటేష్‌ని కొనసాగించిన అనిల్ నెక్స్ట్ వెంకీ సార్‌తోనే సినిమా ఫిక్స్ చేసుకునే అవకాశాలు ఉన్నాయని టాక్.

వెంకటేష్ మాత్రమే కాదు అనిల్ ఈసారి దగ్గుబాటి మల్టీస్టారర్‌గా రానాని కూడా ఈ ప్రాజెక్ట్ లోకి తీసుకుంటున్నాడని అంటున్నారు. ఏది ఏమైనా హిట్ ఫాంలో ఉన్న డైరెక్టర్ కాబట్టి అనిల్ ఏం చేయాలనుకున్నా సరే ప్రొడ్యూసర్స్ రెడీ అనేస్తారు. దిల్ రాజుతో మంచి కొలాబరేషన్ కొనసాగించిన అనిల్ రావిపూడి ఎస్.వి.సి బ్యానర్ కాకుండా సాహు గారపాటితోనే రెండు సినిమాలు చేశాడు. ఐతే నెక్స్ట్ సినిమా ఎవరితో చేస్తాడన్నది చూడాలి. అనిల్ రావిపూడి సినిమా అంటే హీరోలే కాదు హీరోయిన్స్ కూడా రెడీ అనేస్తున్నారు. పండగకి సినిమా.. ఫ్యామిలీ మొత్తం చూసే మంచి ఎంటర్టైనర్‌లో నటించాలని ఎవరి ఉండదు. అందుకే యువ హీరోయిన్స్ నుంచి స్టార్ హీరోయిన్స్ కూడా అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో ఛాన్స్ కోసం ఎదురు చూస్తున్నారు.

# మారుతిపై మరీ అంత కక్ష్యనా? ఆగేదెప్పుడు?



టాలీవుడ్‌లో హిట్లు, ఫ్లాపులు ఎప్పుడూ కామనే. అయినా కొన్ని సందర్భాల్లో ఫ్లాప్ సినిమా ప్రభావం వ్యక్తిగత స్థాయికి వెళ్లడం చర్చనీయాంశంగా మారుతోంది. తాజాగా దర్శకుడు మారుతి విషయంలో జరుగుతున్న పరిణామాలు సినీ వర్గాల్లో కాకుండా సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారాయి. ఆయన దర్శకత్వం వహించిన రాజా సాబ్ రీసెంట్‌గా థియేటర్స్‌లో రిలీజ్ అయ్యి మిక్స్‌డ్ రెస్పాన్స్ అందుకుంది. పాన్ ఇండియా ప్రభాస్ నటించిన ఆ సినిమా భారీ హిట్ అవుతుందని అంతా అంచనా వేశారు. మారుతి కూడా అదే నమ్మకంతో ఉన్నారు. రిలీజ్‌కు ముందు మూవీపై పెద్ద ఎత్తున హైప్ కూడా క్రియేట్ చేశారు. కానీ అనుకున్న రేంజ్‌లో సినిమాతో మాత్రం ఆకట్టుకోలేకపోయారు. దీంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. సినిమా వచ్చి చాలా రోజులు అవుతున్నా.. ట్రోల్స్ ఆగడం లేదు. అంతటితో ఆగకుండా.. కొన్ని రోజులుగా మారుతి ఇంటికి ఫుడ్ పార్సిల్స్ పంపి కొందరు చాలా ఇబ్బంది పెడుతున్నారనే చెప్పాలి. నిజానికి.. సినిమాపై నమ్మకంతో మూవీ అభిమానుల అంచనాలను అందుకుంటుందని, ఏమైనా తేడా వస్తే తన ఇంటికే వచ్చి మాట్లాడొచ్చంటూ అడ్రస్ చెప్పారు మారుతి. దీంతో రిలీజ్ కు ముందు మారుతి ఇంటికి బిరియానీలు, ఫుడ్ పార్సిల్స్ కొందరు పంపించారు. దీనిపై మారుతి కూడా సంతోషం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. కానీ ఇప్పుడు ఆయన ఇంటికి వందల్లో ఫుడ్ పార్సిల్స్ వస్తున్నాయి. అది కూడా క్యాష్ ఆన్ డెలివరీ మోడ్‌లోనే. దీంతో మారుతి ఇంటి వద్ద గందరగోళం ఏర్పడుతోంది. రోజూ డెలివరీ బాయ్స్ గేట్ వద్దకు రావడం, సెక్యూరిటీ వారిని అడ్డుకోవడం, తిరిగి వెళ్లిపోవడం.. ఇదే రోజూ జరుగుతున్న పరిస్థితి. అందుకే ఇప్పుడు మారుతి ఆ విషయంలో చాలా ఇబ్బంది పడుతున్నారట. సినీ పరిశ్రమలో హిట్, ఫ్లాప్స్ సహజం.

ఒక సినిమా ఫలితం నచ్చలేదని వ్యక్తిగత స్థాయిలో వేధింపులకు దిగడం సరికాదన్న ఇప్పుడు సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజా సాబ్ విషయాన్ని పక్కన పెట్టి, ప్రభాస్‌లాగే అభిమానులు కూడా కూల్ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. అదే సమయంలో ప్రభాస్ రెస్పాండ్ అవ్వాలని అనేక మంది నెటిజన్లు కోరుకుంటున్నారు. ఒక్క పోస్ట్ పెడితే.. మారుతి పడుతున్న ఇబ్బందులు ఆగుతాయని ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. ఎవరూ కావాలని ఫ్లాప్ కోరుకోరని, కొన్ని తప్పుల వల్ల మూవీ రిజల్ట్ అలా వచ్చి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అంతేగానీ ఇలా చేయడం అసలు కరెక్ట్ కాదని.. అంతలా కక్ష్య పెట్టుకోవడం ఏ మాత్రం సమంజసం కాదని చెబుతున్నారు.

# లెనిన్ తర్వాత అఖిల్ ప్లాన్ ఏంటి..?



అక్కినేని యువ హీరో అఖిల్ ప్రస్తుతం లెనిన్ అంటూ రాబోతున్నాడు. సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమాను మురళి కిషోర్ అబ్బూరు డైరెక్ట్ చేస్తున్నారు. సినిమాలో భాగ్య శ్రీ బోర్స్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఐతే లెనిన్ సినిమా అసలైతే లాస్ట్ ఇయర్ నవంబర్ రిలీజ్ ప్లాన్ చేయగా ఆ తర్వాత వాలెంటైన్ వీక్ రిలీజ్ అనుకున్నారు. కానీ ఫైనల్‌గా మే 1న ఈ సినిమా రిలీజ్ లాక్ చేశారు. సమ్మర్‌లో సత్తా చాటేందుకు అఖిల్ తన క్రేజీ సినిమా లెనిన్‌తో రాబోతున్నాడు. ఐతే లెనిన్ సినిమా యాక్షన్ కం లవ్ ఎంటర్టైనర్‌గా వస్తుందని తెలుస్తుంది. సినిమాలో అఖిల్ లుక్స్ ఇంప్రెస్ చేశాయి. అఖిల్, భాగ్య శ్రీ జోడీ కూడా సినిమాకు హైలెట్ అయ్యేలా ఉంది. ఐతే అఖిల్ లెనిన్ రిలీజ్‌కు రెడీ అవుతుండగా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటుంది. ఐతే ఈ సినిమా తర్వాత అఖిల్ నెక్స్ట్ సినిమా ఏంటన్న డిస్కషన్ మొదలైంది. అఖిల్ ఏజెంట్ తర్వాత కూడా ఏ సినిమా చేస్తున్నాడు అంటూ రకరకాల చర్చలు జరిగాయి. ఐతే సైలెంట్‌గా లెనిన్‌ని సెట్స్ మీదకు తీసుకెళ్లి టీజర్‌తో సర్ ప్రైజ్ చేశారు. లెనిన్ తర్వాత అయినా అఖిల్ నెక్స్ట్ సినిమాను వెంటనే స్టార్ట్ చేస్తే బాగుంటుందని అక్కినేని ఫ్యాన్స్ కోరుతున్నారు. కెరీర్‌లో ఒక మాస్ హిట్ కోసం ఎదురు చూస్తున్న అఖిల్ లెనిన్‌తో అది సాధించేలా కనిపిస్తున్నాడు. ఒక పక్కా కమర్షియల్ సినిమా మీటర్‌లోనే లెనిన్ వస్తుంది. అఖిల్‌లో ఉన్న మాస్ స్ట్రెంత్ చూపించేలా లెనిన్ వస్తుంది. ఐతే నెక్స్ట్ సినిమా విషయంలో మరీ లేట్ చేయకుండా త్వరగా ఫిక్స్ చేయాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. అసలైతే అఖిల్‌తో యువి సినిమాస్ ఇంకా హోంబలె ప్రొడక్షన్స్ కూడా మూవీస్ ప్లానింగ్ ఉందని టాక్. ఐతే వాటిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఆఫ్టర్ మ్యారేజ్ అఖిల్ ఇక తన ఫోకస్ అంతా సినిమాల మీదే పెడుతున్నాడు.

లెనిన్ సినిమాతో కమర్షియల్ సక్సెస్ అందుకుని నెక్స్ట్ సినిమాలతో పాన్ ఇండియా అటెంప్ట్ చేయా లనే ప్లానింగ్‌లో ఉన్నాడని తెలుస్తుంది. లెనిన్ సినిమాలో ముందు శ్రీలీల హీరోయిన్‌గా ఫిక్స్ అవగా ఆమెతో కొంత పార్ట్ షూటింగ్ కూడా చేశారు. కానీ మధ్యలో శ్రీలీల ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ అవగా ఆ ప్లేస్‌లో భాగ్యశ్రీ వచ్చి చేరింది. టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో భాగ్య శ్రీ సూపర్ క్రేజ్ తెచ్చుకుంటుంది. ఈ ఇయర్ లెనిన్‌తోనే తన హిట్ ఖాతా తెరవాలని చూస్తుంది అమ్మడు.

# భూ పరిష్కారమే గ్రామసభ లక్ష్యం: విడవలూరు తహసీల్దార్ చంద్ర శేఖర్






**కోవూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు పంచాయతీలో భూ సమస్యలు ఉన్న వారికీ సమస్యలు పరిష్కరించడం గ్రామ సభ లక్ష్యం అని విడవలూరు మండలం తహసీల్దార్ చంద్ర శేఖర్ అన్నారు. వావిళ్ళ గ్రామంలో 4వ విడత గ్రామసభలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం చెయ్యడం జరిగింది అని తహసీల్దార్ చంద్ర శేఖర్ అన్నారు. పట్టాదారు యజమానులకు చెందిన భూసమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఆదేశాలు మేరకు గ్రామ సభలు ద్వారా నెలకు ఒక పంచాయతీలోని భూ సమస్యలను పరిష్కారం చేస్తు న్నామని విడవలూరు తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, వి ఆర్ ఓలు సర్వేయర్లు, పలువురు సిబ్బంది. టీడీపీ మండలం అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ ఏటూరు హరిరెడ్డి స్థానిక అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్‌కు జిల్లా ఎస్పీ చేయూత



**డక్కిలి ప్రతినిధి, (రాజధాని వార్తలు):** అంధ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్న రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్‌కు బుధవారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు నగదు ప్రోత్సాహకం అందజేశారు. అంధ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా స్పూర్తిని వెలికి తీయడమే లక్ష్యంగా, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గోల్‌బాల్ వంటి క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్న రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్‌కు నగదు సహాయం అందజేసినట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి పెంచలనర్సయ్య తెలిపారు. అంధ క్రీడాకారులు వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సాధించిన పతకాలు, విజయాలను సంఘ అధ్యక్షుడు పెంచల నర్సయ్య ఎస్పీకి వివరించడంతో వెంటనే స్పందించి ఆయన అంధ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**గోల్‌బాల్‌లో అంతర్జాతీయ గుర్తింపు**

రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి గోల్‌బాల్ క్రీడలో నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతున్నట్లు నర్సయ్య తెలిపారు. సరైన మార్గనిర్దేశం, ప్రోత్సాహం లభిస్తే అంధ క్రీడాకారులు కూడా అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటగలరనే విషయాన్ని వారు నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ "శారీరక పరిమితులు ప్రతిభకు అడ్డంకి కావు. అంధ క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు దీనికి నిదర్శనం. రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయం. ఇలాంటి సంస్థలకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక తోడ్పాటు అందిస్తే భవిష్యత్తులో మరింత మంది అంధ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. జిల్లా ఎస్పీ చేయూతతో అంధ క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. తమ ప్రతిభకు లభించిన గుర్తింపు మరింత కృషి చేయడానికి ప్రేరణగా నిలుస్తుందని వారు తెలిపారు. ఈ సహాయం ద్వారా శిక్షణ, పరికరాలు, పోటీ ప్రయాణ వ్యయాలకు ఉపయోగాల కోసం ఖర్చు చేయడం జరుగుతుందని అసోసియేషన్ పెంచల నర్సయ్య పేర్కొన్నారు.

# హిమావతి లింగాలస్వామి భూములు ఆలయానికే

## - సాగు హక్కులు గిరిజన పూజారులకే - తహసీల్దార్ శ్రీనివాసులు స్పష్టం





**డక్కిలి ప్రతినిధి, (రాజధాని వార్తలు)** డక్కిలి మండలం ఎగువ లింగసముద్రం గ్రామంలో ఉన్న హిమావతి లింగాలస్వామి ఆలయ భూముల హక్కులు స్వామివారి గుడి పేరుమీదే కొనసాగిస్తామని, అయితే ఆ భూములను సాగు చేసుకునే హక్కు మాత్రం ఆల యంలో సేవలు చేస్తున్న గిరిజన పూజారులకే కల్పిస్తామని తహ సీల్దార్ ఎం.శ్రీనివాసులు స్పష్టం చేశారు.
గత కొంతకాలంగా ఆలయ అనుభవంలో ఉన్న సుమారు 7.30 ఎకరాల భూములకు సాగు పట్టాలు ఇవ్వాలంటూ గిరిజనులు డిమాండ్ చేస్తుండగా, దీనిపై గ్రామస్థులు ఇటీవల పీజీఆర్ ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో బుధవారం తహసీల్దార్ సంబంధిత భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులు, గ్రామస్తులతో విడివిడిగా మాట్లాడి సమస్యపై సమగ్రంగా చర్చించారు. ఆలయ భూములపై పూర్తి హక్కులు ఆలయం పేరుమీదే ఉంటాయని, అయితే కౌలు పద్ధతిలో సాగు చేసుకునే అవకాశం గిరిజనులకు కల్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. కౌలు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు.
ఈ ప్రతిపాదనకు గ్రామస్థులు, గిరిజనులు ఇద్దరూ అంగీకరించడంతో సమస్యకు పరిష్కారం లభించిందని తహసీల్దార్ వెల్లడించారు. ఈ నిర్ణ యంతో ఆలయ ఆస్తులు పరిరక్షణకు నోచుకోగా, గిరిజనులకు జీవనాధారం కూడా కొనసాగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# కోవూరు తహసీల్దార్ సతీమణి స్వాతి అకాల మృతి తీరని లోటు



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు తాసిల్దార్ సుబ్బయ్య సతీమణి చలంచర్ల స్వాతి బుధవారం శివైక్యం చెందారు. ఆమె మృతి తీరని లోటు పలువురు ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. అంత్యక్రియలు స్వగ్రామమైన జలదంకి మండలం కేశవరంలో 29న గురువారం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. 8 గంటల వరకు నెల్లూరు ధనలక్ష్మీపురంలో ఉంచుతారు. అనంతరం ఆమె పార్ధవదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వెళ్ళనున్నట్లు సమాచారం.

# కొంత సమయం క్రీడల కోసం...

## - సచివాలయ ఉద్యోగుల క్రీడా స్ఫూర్తి అభినందనీయం - నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోనే తొలిసారిగా సచివాలయ వార్డు ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు చేసి వార్షిక క్రీడలు ప్రారంభించడం అభినందనీయమని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సచివాలయ వార్డు ఉద్యోగుల వార్షిక క్రీడా సంబరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్‌తో కలిసి హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసం కోసం ఉద్యోగులు క్రీడా స్ఫూర్తితో రాణించాలని సూచించారు. మంత్రి నారాయణ సహకారంతో రాష్ట్రంలోనే తొలిసారిగా జేఏసీ ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ క్రీడా పోటీలు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడిని తగ్గించుకునేందుకు కొంత సమయం క్రీడల కోసం కేటాయించాలన్నారు. అనంతరం త్రోబాల్ క్రికెట్ క్రీడాకారులను అభినందించి కాసేపు వారితో కలిసి ఆటలాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్ నగర మేయర్ రూప్ కుమార్ యాదవ్, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, అడిషనల్ కమిషనర్ హిమబిందు, నగర ప్రాజెక్టు ఆఫీసర్ వాసు బాబు, సచివాలయ వార్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆత్మస్థైర్యంతో ముందుకు సాగండి

## - మనల్ని బలమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడానికే జీవితంలో కష్టాలొస్తాయి... దృఢంగా ఎదుర్కోవాలి - కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి - విద్యార్థుల్లో కొత్త ఆశ, ఆత్మవిశ్వాసాన్ని నింపిన కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చదువు, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఏ పరిస్థితినైనా జయించవచ్చని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో కరోనా మహమ్మారి సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులతో హృదయ పూర్వకంగా ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన పోస్టాఫీసు పాస్‌బుక్స్, సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమం మొత్తం మానవీయత, ఆప్యాయత, ధైర్యం నింపే మాటలతో సాగింది. విద్యార్థులను పేరుపేరున పలకరించిన కలెక్టర్, వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్ లక్ష్యాలు, ఎదురవుతున్న ఇబ్బందులపై ఆత్మీయంగా మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలు మనల్ని బలహీనుల్ని చేయడానికి కాదు, బలమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడానికి వస్తాయని తెలిపారు. ఆత్మస్థైర్యంతో ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని విద్యార్థుల్లో ధైర్యం నింపారు. ఒక స్పష్టమైన ప్రణాళికతో చదవాలని, ప్రతిరోజూ పాఠ్యాంశాలతో పాటు గతంలో చదివిన అంశాలను కూడా నెమరువేసుకోవాలని సూచించారు. పాఠ్యాంశాల్లోని ముఖ్యమైన అంశాలను గుర్తుపెట్టుకుంటే విజయం సులభమవుతుందని తెలిపారు. మానవ విలువలు, మంచి స్వభావమే జీవితంలో అత్యంత ముఖ్యమని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచిస్తూ, ఎప్పుడైనా సహాయం అవసరమైతే తనను నేరుగా సంప్రదించాలని విద్యార్థులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ ముఖాముఖీ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఆశ, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన జిల్లాలోని 24 మంది విద్యార్థులకు పీఎం కేర్స్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించి, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సంబంధిత పోస్టాఫీసు పాస్‌బుక్స్‌ను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన్, బాలల సంరక్షణాధికారి సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓ చేతుల మీదుగా ఉత్తమ సేవలకు పురస్కారాలు





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలంలో ఎన్ఆర్ఎజిఎస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మండల జెఇ వి.వి. సతీష్ కుమార్, ఎపిడ్ డి. సుధీర్లకు 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ చేతుల మీదుగా డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఉ త్తమ సేవలకు మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.
ఈ సందర్భంగా ఉత్తమ పురస్కారాలు అందుకున్న సతీష్ కుమార్, ఎపిఓ సుధీర్లను ఎస్ఆర్ జిఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది కర్రి వీరబాబు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

# పట్టాదారు పాస్ పుస్తకాలలో తప్పులు సరి చేయడానికి ఆప్షన్ : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** కొత్త పాస్ పుస్తకాలలో తప్పులు ఉంటె సరి చేయడానికి తహసిల్దార్ల లాగిన్‌లో ఆప్షన్ ఇవ్వడం జరిగిందని, తప్పులు సరి చేసి పాస్ పుస్తకాలు ఇవ్వడా నికి తహసిల్దార్లంతా సిద్ధం కావాలని తెలిపారు.

బుధవారం తఃసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన 12 గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాలను వెరిఫై చేసి తప్పులను సవరించి ఫిబ్రవరి నెలలో పంపిణీ చేయా లని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు.

బొబ్బిలి, గజపతినగరం, రేగిడి ఆమదాలవలస, రాజాం, గుర్ల, చీపురు పల్లి, నెల్లిమర్ల, భోగాపురం, విజయనగరం, ఎస్.కోట, ఎల్.కోట మండలాల్లో 12 గ్రామాలలో ప్రింటింగ్ కోసం 3008 సవరిం చిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రింటింగ్ చేసి పంపిణీ చేయాలని తెలిపారు.

# అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారు - వైకాపా నేతల విమర్శ




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** టిడిపి నాయకులు ఏఎంసీ చైర్మన్ పి.వి.వి గోపాలరాజు, గంట్యాడ శ్రీదేవి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని వైకాపా నాయకులు మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, జిల్లా అధికార ప్రతినిధులు కరణం ఆదినారా యణ, సుమల గోవింద హితవు పలికారు. స్థానిక వైకాపా పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే బొత్సఅప్పలనరసయ్య కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే టిడిపి నాయకులు ఉలిక్కి పడుతున్నారని అన్నారు. బొత్స అప్పల నరసయ్యను విమర్శించే నైతిక హక్కు గోపాల రాజుకి లేదని అన్నారు. స్థాయి మరిచి మాట్లాడడం తగదన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గం సంపూర్ణ అభివృద్ధి సాధించిందని, ఈ 20 నెలల కాలంలో మీరు ఏమి సాధించారో చెప్పగలరా? అంటూ ప్రశ్నించారు. గ్రామాల్లో సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడుతో పాఠశాలలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఘనత తమ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని, ఇప్పుడు టిడిపి కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని విమర్శించారు. యూరియా దొరకక రైతులు అల్లాడుతున్నారని, టిడిపి నాయకులు యూరియా బ్యాక్ డోర్లో తమకు కావలసినంత తీసుకువెళ్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపై తమతో టిడిపి నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బెల్లాన త్రినాధరావు, వంగపండు లక్ష్మనాయుడు, ఉపసర్పంచ్ కర్రి రామునాయుడు, సీర రమణ, మాజీ ఎంపీటీసీ ఆల్తి రామునాయుడు, బండారు కోటి తదితరులు పాల్గొన్నారు.

# సత్య కళాశాల విద్యార్థిని బి.నీలిమకు రాష్ట్ర స్థాయి కబడ్డీ ప్రథమ బహుమతి

**భీమవరం, (రాజధాని వార్తలు):** భీమవరంలో నిర్వహించిన కీర్తి శేషులు కొల్ల భాస్కర్ అమ్మ గుండా లక్ష్మీపతి స్మారక రాష్ట్ర సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్-2026లో సత్య కళాశాల బి.ఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కుమారి బి.నీలిమ అద్భుత ప్రతిభ కనబ రిచి విజయనగరం జిల్లా కబడ్డీ జట్టులో స్థానం సంపాదించి జట్టు తరుపున ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరప నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్, అధ్యాపకులు మరియు విద్యార్థులు నీలిమను హృదయపూర్వకంగా అభినందించారు. క్రమశిక్షణ, కఠిన సాధన మరియు ఆత్మవిశ్వాసంతో ఆమె ఈ విజయాన్ని సాధించారని శశిభూషణ రావు ప్రశంసించారు. ఈ ఘన విజయం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవి ష్యత్తులో జాతీయ స్థాయిలోనూ నీలిమ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, కళాశాల యాజమాన్యం ఆమెకు సంపూర్ణ మద్దతు అందిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నీలిమ విజయం సాధించడానికి కేవలం ప్రతిభ మాత్రమే కాదు కఠిన




సాధన, క్రమశిక్షణ మరియు పోరాట స్ఫూర్తి ప్రధాన కారణం అనీ కళాశాలలో మిగిలిన విద్యార్థులకు స్ఫూర్తి అని అన్నారు.

# దేశవ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలి - సి.ఐ.టి.యు నాయకులు

**గూడూరు, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాపిత సమ్మెలో కార్మికులందరూ ఏకమై సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సార్వత్రిక సమ్మె జరుగుతుందని, కనీస వేతనం ఉద్యోగ భద్రత, పని భారం తగ్గింపు, వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం ఇచ్చిన హామీలపై స్పందించకపోవడం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం చాలా బాధాకరమని సి.ఐ.టి.యు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు నాయకులు పిలుపునివ్వడం జరిగింది. శ్రీ గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ చెంచులక్ష్మికి అదేవిధంగా ప్రైవేట్ కంపెనీల మేనేజర్లకు కార్మికులను సమ్మెలో పాల్గొన విధంగా సహకరించాలని నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ.టి.యు నాయ కులు బి.వి.రమణయ్య, పాముంజి మణి, అడపాల ప్రసాద్, గండికోట మధు, కె.ఎస్.వాసులు, రమణయ్య, జి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు మనుగడ సాధించలేదు

## - సిఐటియు జిల్లా నాయకులు ఎం.బి.నర్సారెడ్డి - అధికారులకు కార్మికుల పక్షాన సమ్మె నోటీసులు అందించిన సిఐటియు





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** కార్మికులను ఇబ్బందులకు గురి చేసి వారి ఆగ్రహానికి గురైన ఏ ప్రభుత్వాలు ఇప్పటివరకు మనుగడ సాధించిన చరిత్ర లేదని కార్మికులతో పెట్టుకుంటే కచ్చితంగా పాతాళంలో కలిసిపోవడం ఖాయమని సిఐటియు జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి హెచ్చరించారు. బుధవారం ఫిబ్రవరి 12 తారీఖున జరిగే సార్వత్రిక సమ్మె నోటీసులను జిసిసి మేనేజర్ తో పాటు మండల విద్యాధికారి తోటమల మాకు కార్మికులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలను తుంగలో తొక్కి వాటి స్థానంలో కోడ్లను తీసుకు వచ్చి హక్కులను కాల రాస్తున్నారని ఆరోపించారు. దేశంలో మోడీ అధికారం చేపట్టిన నాటి నుండి ఒక్కొక్కటిగా కార్మికుల హక్కులను స్వేచ్ఛను హరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నో వేల మంది కార్మికులు తమ ప్రాణాలను బలిదానం చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని సైతం మోడీ తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. కార్మికులకు ఇవ్వాల్సిన కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వకుండా పని గంటలు పెంచే కుట్రలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12వ తారీఖున దేశవ్యాప్తంగా కార్మికులు సార్వత్రిక సమ్మెకు తల పెట్టారని అన్నారు. కార్మిక చట్టాల స్థానంలో నూతనంగా తీసుకొచ్చిన కోడ్లను రద్దు చేయడంతో పాటు కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలని పనిచేసే చోట భద్రత పాటు రక్షణ కల్పించాలని మహిళా కార్మికులకు ప్రత్యేక సదుపాయాలను కల్పించాలని తదితర డిమాండ్లతో ఈ సార్వత్రిక సమ్మెకు కార్మికులు పూనుకున్నారని అన్నారు. 12వ తారీకున జరిగే సార్వత్రిక సమ్మెతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికార మత్తు వదులుతుందని అన్నారు.

కార్మికులు వారి హక్కుల కోసం తలపెట్టిన ఈ సార్వత్రిక సమ్మెకు అధికారులు సైతం పూర్తి సహాయ సహకారాలు అందిం చాలని కోరారు. జిసిసి శాఖలో కార్మికులు సరిపోను వేతనాలు పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సైతం ఎన్నో సంవత్సరాలుగా అదే వృత్తిలో కొనసాగుతున్న ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని భోజన బిల్స్ సైతం సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా కార్మికులందరూ ఒక తాటిపైకి వచ్చి ఫిబ్రవరి 12వ తారీకున జరిగే సమ్మెను విజయవంతం చేసి కార్మికుల ఐక్యతను ప్రపంచానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నకిరేకంటి నాగరాజు పారేల్లి సంతోష్ కుమార్ పిలక శివకుమారి సిహెచ్ రమా జ్యోతి నాగమణి రాజేశ్వరి రామారావు సుబ్రహ్మణ్యం ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

# సంస్థల బలోపేతానికి ప్రణాళికాయుతంగా పని చేయాలి : డిపిఎం చిరంజీవి




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** సంస్థల బలోపేతానికి ప్రతి ఒక్కరూ నిర్దిష్టమైన ప్రణాళికతో పనిచేయాలని వెలుగు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ.చిరంజీవి అన్నారు. స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్ మూడవ మాడ్యూల్‌పై రెండవ రోజు శిక్షణ ఏపీఎం పి.నారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరు రాబోయే 5 సంవత్సరాలలో ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో పనిచేసి సంస్థలు బలోపేతానికి చర్యలు తీసుకొని, ఆదర్శవంతమైన సమాఖ్యలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ శిక్షణలు ద్వారా సంఘ సభ్యుల యొక్క ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు మెరుగుపరచుకొనేటట్లు, అలాగే సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకొనే విధంగా అవగాహన కల్పించి ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్నదే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం లో ఐబి ఎపియం వి.విశ్వేశ్వరరావు, శిక్షకులు అరుణ, శ్రీనివాస్, సులోచన, అచ్యుత్, వెంకటరమణ, గోవింద్, రత్నకుమార్, ఏడు మండలాలు అకౌంటెంట్‌లు పాల్గొన్నారు.

# పోస్టల్ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి : పోస్టల్ ఇన్స్పెక్టర్ బొద్దల ఉపేంద్ర

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** పోస్టల్ పథకాలు ప్రజలకు మరింత చేరువ కావాలని, ఆ దిశగా సిబ్బంది కృషి చేయాలని గజపతినగరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ బొద్దల ఉపేంద్ర అన్నారు.బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో డివిజనల్ స్థాయి పోస్టల్ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన పథకాలను క్షుణ్ణంగా వివరించారు. ప్రతి ఒక్కరు ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయవంతం



చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ ఇద్దరు మృతి : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రెండు వేరువేరు ప్రమాద సంఘటనలలో చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు బుధవారం తెలిపారు. మండలంలోని బూడిపేట గ్రామానికి చెందిన మజ్జి పెంటయ్య పురుగుల మందు తాగి విజయనగరం హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందగా, సాలిపేట గ్రామానికి చెందిన కొడిసి ఆదినారాయణ చింత చెట్టు ఎక్కి చింత బోట్టలు రాలుపుతూ ప్రమాదవశాత్తు చింత చెట్టు నుంచి జారిపడి తీవ్ర గాయాలకు గురై విశాఖపట్నం కేజీహెచ్లో చేరాడు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688899
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# కోస్టల్ సైకిల్ యాత్రను విజయవంతం చేయండి

## - సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వికాస్ కుమార్ సాహు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దేశంలో ఉండే తీరప్రాంత మత్స్యకారులలో దేశ రక్షణలో భాగంగా అవగాహన కల్పించడం కోసం సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేసే వందేమాతరం కోస్టల్ సైకిల్ యాత్రను దిగ్విజయం చేయాలని డిప్యూటీ కమాండెంట్ వికాస్ కుమార్ సాహు కోరారు. భీమిలి జోన్ 3వ డివిజన్ మత్స్యకారుల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వందేమాతరం సైకిల్ యాత్ర యొక్క వివరాలను కమాండెంట్ వికాస్ కుమార్ సాహు వివరించారు. ఫిబ్రవరి 6వ తేదీ మధ్యాహ్నం 3 గం.ల ప్రాంతంకి భీమిలి తీరంకి ఈ యాత్ర చేరుకుంటుందని అన్నారు. మత్స్యకారులు తీరప్రాంత రక్షణలో ఏవిధంగా ఉండాలనే విషయంపై అవగాహన కల్పించడం కోసం దేశమంతా సైకిల్ యాత్ర చేస్తున్నామని దీనికి మీయొక్క సహకారం కావాలని కోరారు. మత్స్యకారుల నాయకుడు గంటా నూకరాజు మాట్లాడుతూ సముద్రంలో వేటసమయంలో గాని, తీరంలో గాని మత్స్యకారుడు తుపాకి చేతిపట్టని సైనికుడిలా ఉంటాడని అన్నారు. కొత్త వ్యక్తులు వచ్చినా, సముద్రంలో ఏ ఇతర సందేహంతో కూడిన బోటు కనిపించినా ముందుగా స్పందించింది మత్స్యకారుడేనని అన్నారు. దేశ రక్షణ కోసం మీరు చేస్తున్న ఈ యాత్రకు మా సహకారం ఉంటుందని అన్నారు. మరొక మత్స్యకారుల నాయకుడు మైలపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ తీరప్రాంత మత్స్యకారులను దేశ రక్షణ కోసం సంఘటితం చేయడం కోసం మీరు చేస్తున్న సైకిల్ యాత్ర శుభప్రధమని అన్నారు. ఇలాంటి కార్యక్రమం విజయవంతంలో మా మత్స్యకారులు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని అన్నారు. మేమందరం ఒకసారి మాట్లాడుకొని 2025లో జరిగిన కార్యక్రమం కంటే ఇంకా గొప్పగా చేసే విధంగా ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ కమాండెంట్ ఏ.కె.మహాపాత్రు, ఇన్స్పెక్టర్స్ ఎస్.సి. ఘోష్, హెచ్.ఎల్. మీనా, ఎల్.వి.రామకృష్ణ, ఇతర మహిళా అధికారులతో పాటు మత్స్యకారుల నాయకులు వాడమొదలు సత్యారావు, కాసరపు నాగరాజు, మట్టా దాసు, తెడ్డు రామదాసు, తెడ్డు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికుల్లా పని చేయాలి

## - తాడేపల్లిగూడెంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంపీ అనురాధ





**అమలాపురం, (రాజధాని వార్తలు):** 2029 లో జరిగే ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మో హన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల పనిచేయాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం (జోన్ 2) వర్కింగ్ ప్రెసిడెంట్, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు. నూతనంగా నియమితులైన నియోజకవర్గ సమన్వయకర్త వడ్డే రఘురాం ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనురాధ మాట్లాడుతూ నియోజకవర్గ, గ్రామస్థాయి పార్టీ అనుబంధ కమిటీలను నియమించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మన అందరి లక్ష్యం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయటమేనని ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. కమిటీల నియామకం పూర్తిచేసి వివరాలను కేంద్ర కార్యాలయానికి పంపి డిజిటలైజ్డ్ గుర్తింపు కార్డులను ప్రతి కార్యకర్తకు అందేలా చూడాలన్నారు. ఉగాది నాటికి ప్రతి కార్యకర్తకు డిజిటలైజేడ్ గుర్తింపు కార్డు ఇచ్చేందుకు పార్టీ కృషి చేస్తుందని అలాగే పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచి భరోసా ఇచ్చేందుకు దృఢ సంకల్పంతో ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు భయపడకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, రంగనాథరాజు, ఎమ్మెల్సీ వంక రవీందర్, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు జున్నూరి బాబీ, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా గజమాల యాత్ర

**అల్లవరం, (రాజధాని వార్తలు):** అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా అగ్నికుల క్షత్రియులు గజమాలతో నరసింహ స్వామివారి ఆలయానికి భారీ ఊరేగింపు నిర్వహించారు. అంతర్వేది శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారి ఆలయాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన కోపనాతి కృష్ణమ్మ వర్మ 1823 లో నిర్మించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా కృష్ణమ్మ వర్మ వంశీయులు తమ గ్రామమైన ఓడల రేవు నుండి గజమాలను ఊరేగింపుగా తీసుకుని వెళ్లి కృష్ణమ్మ వర్మకు,స్వామివారికి అలంకరించడం ఆనవాయితీగా సాగుతోంది. కృష్ణమ్మ వర్మ వంశీయులు, జిల్లా నలుమూలల నుండి తరలి వచ్చిన అగ్నికుల క్షత్రియులు బుధవారం ఓడలరేవు గ్రామానికి చేరుకుని పూజలు నిర్వహించి గజమాలతో ఊరేగింపుగా బయలుదేరారు. అల్లవరం, పేరూరు వై జంక్షన్, జగ్గన్నపేట, రాజోలు మీదుగా గజమాల యాత్ర నిర్వహించారు. దారి పొడవున అగ్నికుల క్షత్రియ నాయకులు, కార్యకర్తలు, భక్తులు గజమాల యాత్రలో పాల్గొంటూ భారీ ఊరేగింపుగా గజమాల యాత్ర అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధికి చేరి కృష్ణమ్మ వర్మ, స్వామివార్లకు అలంకరించారు.

ఈ కార్యక్రమంలో కృష్ణమ్మ వర్మ వంశీయులు కొపనాతి శ్రీనివాసరావు, కొల్లు శ్రీనివాసరావు, సర్పంచ్ మల్లాడి మంగయమ్మ ఉమామహేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, పెమ్మాడి సాయిబాబు, కొల్లు త్రిమూర్తులు, కొప్పాడి రామకృష్ణ, చిలకలపూడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల్లో ఆత్మస్థైర్యం నింపాల్సిన బాధ్యత అందరిది

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** బాలికలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది కేఎంఎల్ గణేష్ సూచించారు. పెద్దాపురం గౌరీ కోనేరు 18వ సచివాలయంలో బుధవారం న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలను సంరక్షించేందుకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ వారి పట్ల వివక్ష కొనసాగుతుందని, బాల్య వివాహాలు నేటికీ జరుగుతున్న అన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వరకట్న నిషేధం, పోక్సో, వంటి పలుచట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కార్యదర్శులు ఏడుకొండలు, సురేష్, సచివాలయ సిబ్బంది పారా లీగల్ వాలంటీర్లు మాసా చంద్రరావు, కే వెంకటలక్ష్మి, బళ్ళ సూర్యనారాయణ మూర్తి వార్డు మహిళలు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan